ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

అక్టోబర్ 9, 2005

Entered



జంఝావతికి రబ్బర్ డ్యామ్

తేనీటివిందుతో ఏర్పడ్డ అమెరికా

టర్నింగ్ పాయింట్



సైబర్ స్పేస్‌తో సయ్యాట

విజ్ఞాన వీచిక

హ్యాపీ బర్త్‌డే

(9.10.2005 నుంచి
15.10.2005 వరకు)

జి. హేమంత్(బన్ని)
1సం॥, 9.10.2004
లక్ష్మి-సతీష్
జంగారెడ్డిగూడెం-ప॥గో॥

జమీలా
1సం॥, 10.10.2004
మన్నా-అల్లాబక్షు
గండ్రాయి-కృష్ణా

రాహుల్
4సం॥, 12.10.2001
శారద-వెంకటేష్
మిడ్జిల్-మ॥నగర్

జి. తేజ
2సం॥, 12.10.2003
లక్ష్మి-గోపి
వనపర్తి-మ॥నగర్

డి. అరుణ్
6సం॥, 9.101999
లక్ష్మి-హరిచంద్
సారంగపూర్-నిజామాబాద్

ఎస్. పవన్
7సం॥, అక్టోబర్-1998
జయమ్మ-భిక్షపతి
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

సాయి కార్తీక్ కుమార్
1సం॥అక్టోబర్-2004
లక్ష్మి-త్రినాథ్
నక్కపల్లి-విశాఖ

జి. రాకేష్‌కిరణ్
5సం॥, అక్టోబర్-2000
రజిత-శ్రావణ్‌కుమార్
యం.వి. కాలని-వరంగల్

ప్రవళిక
1సం॥, అక్టోబర్-2004
లక్ష్మి-తిరుపతయ్య
పెంట్లవెల్లి-మ॥నగర్

మహేష్‌బాబు
7సం॥, 910.1998
వెంకాయమ్మ-వెంకటేశ్వర్లు
ఒంగోలు-ప్రకాశం

సాయి శ్రీ వాత్సవ్
4సం॥, 14.10.2001
రమా సుందరి-వెంకటేశ్వరరావు
హైదరాబాద్

చైతన్య
4సం॥, అక్టోబర్-2001
అనిత-శివప్రసాద్
రాయచోటి-కడప

కె. రాజేష్‌బాబు
అక్టోబర్-14
కిరణ్‌కుమారి-ప్రభాకరరావు
ఆత్మకూరు-గుంటూరు

జి. గౌతమి
5సం॥, అక్టోబర్-2000
బాలీశ్వరమ్మ-కృష్ణయ్యగౌడ్
నాటవెల్లి-మ॥నగర్

సిహెచ్. రాకేష్(రణదివె)
1సం॥, 12.10.2004
మంజుల-లక్ష్మీనారాయణ
నల్లగొండ

ఎమ్. లలిత(చేతు)
2సం॥, 13.102003
పద్మ-ధర్మారావు
అనకాపల్లి-విశాఖ

అనూష
2సం॥, అక్టోబర్-2003
ఝాన్సీ-మోషేబాబు
అరుగొలను-పశ్చిమగోదావరి

ఎం. ప్రియాంక
2సం॥, అక్టోబర్-2003
లావణ్య-మల్లేశం
రామచంద్రాపురం-మెదక్

ఆహ్వానం

పదేళ్ల లోపు చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. e mail ద్వారా కూడా ఫొటోలు పంపవచ్చు. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీ బర్త్‌డే, స్నేహ, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
1-1-298/4, స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్, హైదరాబాద్-20
e mail: happybirthday_prajasakti@yahoo.com

ఈ వారం అతిథి

మన అతిథి గురించి...

పేరు	:	ఆవుల మంజులత
ఊరు	:	తెనాలి
పుట్టిన తేది	:	1948, ఏప్రిల్ 9
విద్య	:	ఎం.ఎ (భాషా సాహిత్యం), పిహెచ్‌డి (త్రిపురనేని రామస్వామి సాహిత్యం)
వృత్తి	:	తెలుగువిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్
నచ్చిన వ్యక్తి	:	మదర్ థెరిస్సా
నచ్చని అంశం	:	విధి నిర్వహణలో నిర్లక్ష్యం
హాబీ	:	పుస్తక పఠనం, అధ్యయనం

కుటుంబ వ్యవస్థపై పాశ్చాత్య ప్రభావం

పత్రికలూ, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే అంశాలు పరిశీలిస్తే సమాజంలో విలువలు రోజరోజుకూ పతనమవుతున్నాయనే అనిపించేది నాకు. వాస్తవాలు పరిశీలిస్తే అంతలా పతనం కాలేదనే చెప్పొచ్చు. విలువల పతనానికి కారకులు కొందరే కావచ్చు. వారి సంఖ్య పరిమితగంగానే ఉన్నా వాటి ఫలితాలు మొత్తం సమాజంపై ప్రభావం చూపిస్తున్నాయనడంలో సందేహం లేదు. ప్రధానంగా విలువల పతనమే ధ్యేయంగా రాజ్యమేలుతున్నా మిగతా వారు వారిని ఏమీ చెయలేక ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. దీన్ని నివారించడంలో అందరూ నిర్లిప్తంగా ఉండబట్టే విలువల పతనం కొనసాగుతోందని భావించవచ్చు. ప్రభుత్వం దీనితో సంబంధమున్న ఇతర సంస్థల ఉద్యోగుల మధ్య నిర్లిప్తత ఎక్కువగా ఉంటోందనడానికి చాలా ఉదాహరణలున్నాయి. వంద మంది ఉద్యోగస్తుల్లో 20 మందికి మాత్రమే పనుండి మిగతా వారికి పని లేదని ప్రచారముంది. ఇది అక్షరాలా నిజమే. ప్రజా సంస్థలతో పాటు విద్యాసంస్థలలో పని చేసే వారి లోనూ అంకిత భావం, నిబద్ధత కనిపించడం లేదు. పని చేసే ప్రతి ఉద్యోగికీ పనిపట్ల ఉత్సుకత ఉండాలి. అది లేక పోవడం వల్ల సంస్థలు తద్వారా సమాజమూ దెబ్బతింటోంది. సమాజంలో పెరుగుతున్న అవినీతిని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. డబ్బు , వస్తు రూపంలోగాని అవినీతికి పాల్పడితే తప్పేంటి అనే విధానం ప్రస్తుతం సమాజంలో వేళ్లూను కుంటోంది.

భారతీయ సమాజంలో కుటుంబం అనేది చాలా బలంగా ఉంది. ఒక రకంగా ఇది పెట్టని కోట అని చెప్పొచ్చు కుటుంబ వ్యవస్థ రానున్న రోజుల్లోనూ ఇంకా నిలబడాలి. ఇందులో అక్కడక్కడా లోపాలూ ఉన్నాయి. వీటిని అధిగమించాల్సిన అవసరం ఉంది. సమాజంలో నిరక్షరాస్యత, దారిద్ర్యంతో పాటు ఇతర రుగ్మతలూ ఉన్నా వాటన్నింటినీ తట్టుకుని నిలబడేది ఒక్క కుటుంబవ్యవస్థే అని చెప్పక తప్పదు. మనతో పోలిస్తే పాశ్చాత్య దేశాల్లో కుటుంబ వ్యవస్థ అంత బలంగా లేదు. ఒంటరి తనం, అభద్రతాభావం, ప్రేమరాహిత్యమే ఇందుకు ప్రధాన కారణం. దీనికి ఆయా దేశాల్లోని మహిళలే బాధ్యులుగా పేర్కొనవచ్చు. ఆధునికటెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక పాశ్చాత్య దేశాల ప్రభావం వల్ల మన దేశంలోనూ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్న మవుతున్న లక్షణాలు కనిపిస్తున్నాయి. సమాజంలో మహిళలు ఎంత ఎక్కువ విద్యావంతులైతే వారుతమ సమస్యలను అంత త్వరగా పరిష్కరించుకోగల్గుతారు. మహిళలు విద్యావంతులవుతూ సమాజంలో తమ స్థానం, హక్కులూ తెలుసుకుంటున్న కొద్దీ సంఘర్షణ తప్పడం లేదు. మారుతున్న కాలంతో పాటు పురుషులు మారాలి. డబ్బుతోనే అన్నింటినీ కొలవలేము. డబ్బు సంస్కృతితో ముడిపడి ఉన్న విలువలు, సంబంధాలు తగ్గాలి.

ఈ సంచికలో...

ఒపా ...	2
నేర్చుకుందాం..రా!	3
టర్నింగ్‌పాయింట్	4
సలహాలు ...	5
ఇంటి సంగతులు ...	6
క్యాంపస్ చాట్ ...	10
సినిమా కబుర్లు ...	11
బాలనేస్తాలు ...	12
అట్టమీది కథ ...	14
తెంగ్లీషు ...	20
ఓ ఊరి కథ ...	21

సీరియల్ 14

మాధవి



ఇంకా...



మనసా తెలుసా 7

ప్రేమించి పెళ్లాడమా... పెళ్లాడి ప్రేమించడమా...

అయ్యో.... మా కార్డు కథ 18

ఆరోగ్యం ...	17
పప్పెట్ ఇంటర్వ్యూ ...	19
అవీ... ఇవీ	22
విజ్ఞానవీచిక ...	23
కొత్త పుస్తకాలు ...	24

ఆకట్టుకుంది

ఈ వారం 'స్నేహ'లోని 'అట్టమీది కథ' అంతుపట్టని మమ్మీలు...పిరమిడ్‌లు చాలా అద్భుతంగా ఉంది. చదువుతున్నంత సేపూ 'మమ్మీ' సినిమా గుర్తొచ్చింది. అలాగే "ఈ కల నిజం కాకూడదు" కథ చాలా బాగుంది. వెనుకపేజీ "బాలలకథ" పరిష్కారం మా ఇంట్లో పిల్లలందర్నీ ఆకట్టుకుంది. 'మాధవి' సీరియల్ బాగుంది. మరెన్నో విషయాలను ప్రతివారమూ ఇస్తూ... మా మనస్సును దోచుకుంటున్న స్నేహా నీకు మా కృతజ్ఞతలు.

చిప్పాడ ఉమామహేశ్వరరావు,

కురుపాం, బి. శేఖర్ బాబు, కెడి పేట, విశాఖ

ఓ ప్రత్యేకమైన శైలిలో

ఆదివారం అనుబంధంలో దళితాకాశపు ధృవతార గుర్రం జాషువా గురించి 'టర్నింగ్ పాయింట్' శీర్షికలో ఓ ప్రత్యేకమైన శైలిలో వివరించారు. స్వాతంత్ర్యమొచ్చి నేటికి 59 సంవత్సరాలు గడిచినా, కులరక్కసి క్రూరత్వం, మతతత్వ మనోభావాల మత్తులో సమాజం వెర్రిగా ప్రవర్తిస్తోంది. 'నా కవితాకత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం' అన్న ఆనాటి మహనీయుని గురించి సత్య సువర్ణంగా ప్రచురించారు.

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక

ఇలాగే ఉండాలని కోరుతూ...

'స్నేహ'లోని అన్ని శీర్షికలనూ స్నేహితులందరమూ కలిసి చదువుతాం. పప్పెట్ ఇంటర్వ్యూలో 'దంచు దంచు' అనే రచన మాకందరికీ బాగా నచ్చింది. తెంగ్లీష్ బాగుంటోంది. ఈ ఆదివారాన్ని మేం ఆనందంగా గడిపేలా చేసినందుకు మీకు ధన్యవాదాలు. 'ఇంటి సంగతులు' మాకెంతగానో నచ్చింది. ప్రతి ఆదివారమూ ఇలాగే ఉండాలని కోరుతూ...

జె. శ్రావణి, పి. సింధు, వి. రోహిణి, పాల్వంచ,

వి.శ్రావణి, జి స్వాతి, సిహెచ్ సీత, ఖమ్మం

మళ్లీ మళ్లీ చదివా....

'స్నేహ'లోని అన్ని శీర్షికలూ చదివాను. ఒక్కసారి చదివితే సరిపోలా...మళ్లీ మళ్లీ చదివా...ఎందుకంటే అంత బాగా నచ్చాయి. నాకు మరీ విపరీతంగా నచ్చింది కలంస్నేహం.

మీ అభిమాన పాఠకురాలు,

ఖమ్మం

చెప్పలేనంతగా

ప్రతి ఆదివారమూ తప్పకుండా 'స్నేహ' చదువుతాను. ఈ వారం "ఇంటి సంగతులు"లోని 'బట్టలా...గుట్టలా...' రచన నాకు చెప్పలేనంతగా నచ్చింది. పిల్లలకూ, పెద్దలకూ ఈ వ్యాసమెంతో ఉపయోగకరంగా ఉంది.

అపూర్వ, ఎన్జీవో కాలనీ,

హన్మకొండ

తెలుసుకున్నాం

తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచిపోయిన గుర్రం జాషువా గురించి చాలా చక్కగా వివరించారు. ఇంటిసంగతులు, అట్ట మీది కథ చాలా బాగున్నాయి. ఆరోగ్యానికి ఆకుకూరలు శీర్షికలో ఆకుకూరలెలా వండాలో, ఎటువంటి ఆకుకూరలు ఆరోగ్యాన్ని చేకూరుస్తాయో వివరించారు. ముఖ్యంగా 'చారిత్రక వైభవం కనిగిరి దుర్గం' చక్కగా వివరించారు. ఏదేమైనా ఈ వారం ప్రజాశక్తిలో ఎన్నో తెలీని విషయాలు తెలుసుకున్నాం.

బి. లక్ష్మయ్య, గిద్దలూరు

సరికొత్తగా...

'విజ్ఞానవీచిక'లోని శాస్త్రం-విజ్ఞానం బావుంది. ఈ సంచికలో ప్రచురిస్తున్న జోక్సు నాన్ స్టాప్‌గా నవ్విస్తున్నాయి. 'హాపీ బర్త్‌డే' శీర్షికలో చిన్నారులకు ఉచితంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నందుకు థాంక్స్. విభిన్నంగా వినూత్నంగా సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది 'స్నేహ'.

సొల్లేటి సైదాచారి, బాలెంల

అక్షర లక్షలు

వారం వారం అలరిస్తున్న మా 'స్నేహ'లో ఈ వారం అతిథి వాసిరెడ్డి సీతాదేవి మాటలు అక్షరలక్షలుగా ఉన్నాయి. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుంటే... భూమి మీద ఉండే మనుషులు డబ్బు చుట్టూ తిరుగుతున్నారు. డబ్బు కోసం మానవవిలువలు మృగ్యమౌతున్నాయి. తథాగతుని గురించి తెలిపిన విషయాలు పాఠకులకో 'టర్నింగ్ పాయింట్'.

కొవ్వాడ అనంతరావు, విజయనగరం

ఆనందడోలికల్లో...

"స్నేహ" ప్రపంచంలో విహరించేట్లు, ఆనందడోలికల్లో మునిగేట్లు మంచి జ్ఞానాన్ని పెంచే వినూత్న, విలక్షణ, శోభాయమాన ప్రజాశక్తి ఆదివారం అనుబంధం మాకెంతో సంతోషాన్ని చేకూరుస్తోంది. ఆదివారం ఉదయాన 'స్నేహ' నన్ను సమీపిస్తూనే పిల్లల ఫోటోలతో 'హ్యాపీ'గా పలుకరిస్తుంది. 'టపా' అని పేజీ తిరగేస్తూనే 'మనసా...తెలుసా' అని మా మనస్సుకో 'టర్నింగ్ పాయింట్' ఇస్తుంది. 'ఇంటి సంగతులు' ఇవే, నేర్చుకుందాం..రా! అంటే ఎంతో మానసికోల్లాసం చెందుతాం. 'అట్టమీది కథను ఆలస్యం చేయకుండా చదివించి, 'ఓ ఊరికథ'ను వినిపిస్తూ 'తెంగ్లీషు' నవ్వుల్లో మానసిక 'ఆరోగ్యం' చేకూర్చే 'స్నేహ' మాధుర్యానికివే మా మన:పూర్వక కృతజ్ఞతలు.

వెన్ని, పులివెందుల

నేర్చుకుందాం...రా!

ఐస్ క్రీమ్ పుల్లలతో ఫ్లవర్ వాజ్

అగస్త్యరాజు లక్ష్మి సూర్యకళ

ఫోన్ : 040-55839954

ఐస్‌క్రీమ్ తినడం అయిపోగానే మిగిలిన ఆ పుల్లను విసిరావతల పారేస్తాం. అంతేకదా... కమ్మగా తినగా మిగిలిన ఆ పుల్లతో మనకేంటిలే పని అనుకుంటాం. కానీ అలా పనికిరాని వాటితో కూడా ఎంతో కళాత్మకమైన వస్తువులుగాను రూపొందించవొచ్చు. ఫ్లవర్‌వాజ్ లాంటివి తయారుచేయొచ్చు అంటే ఒకింత ఆశ్చర్యమేస్తుంది కదూ... కానీ అందుకని ఒక్కొక్క ఐస్‌ఫ్రూట్ తినేసి అన్ని పుల్లలను ఎలా పోగెయ్యాలా అని, అన్ని పుల్లలు పోగయ్యేంత వరకూ ఐస్‌లు తింటూనే ఉండాలా అని పెద్ద ప్రాజెక్టు పెట్టొద్దు.



ఈ ఐస్‌క్రీమ్ పుల్లలు షాపులో దొరుకుతాయి. వీటితో తయారుచేసిన ఫ్లవర్ వాజ్, దానిలో అమర్చిన పూలు ఎంత ముచ్చటగా ఉన్నదో ఈ ఫొటోలో చూడండి.

ఈ ఫ్లవర్ వాజ్ తయారు చేయటానికి కావలసిన వస్తువులు ఏమిటి చూద్దామా !

(1) ఐస్ క్రీమ్ పుల్లలు, (2) ఫెవికాల్, (3) ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్

ఇక తయారు చేయటం ఎలాగో నేర్చుకుందాం

ముందుగా ఎంత సైజ్ కావాలనుకుంటున్నామో ఆ సైజ్‌కు సరిపడినన్ని ఐస్‌క్రీమ్ పుల్లల్ని తీసుకోవాలి. మూడు పుల్లల్ని త్రిభుజాకారంలో ఫెవికాల్‌తో అతికించాలి. మళ్ళీ వాటికి మధ్యకు వచ్చేలా మూడు పుల్లల్ని త్రిభుజాకారంలో అతికించాలి. ఇప్పుడు ఈ స్టార్ ఆకారంలో ఉన్న ఐస్‌క్రీమ్ పుల్లల మీద ఇంకో వరుస పుల్లలను మొదటి వరుస పుల్లల మధ్య నుంచి బయటకు వచ్చేటట్లు ఫెవికాల్‌తో అతికించాలి. అదే విధంగా సగం వరకు వచ్చాక మళ్ళీలోవలికే వచ్చేటట్లు ఫెవికాల్‌తో అతికించాలి. మళ్ళీకొంత వరకు వచ్చిన తర్వాత ఈ విధంగానే మరల బయటకు వచ్చేటట్లు అతికించాలి. ఇక ఫ్లవర్ వాజ్ తయారైపోయింది. కావాలంటే దానికి మనం పసుపు రంగుగానీ, మరేదైనా రంగు వేసుకోవచ్చు. ఆ తర్వాత దానిలో పూలను అమర్చుకుంటే బాగుంటుంది. దీన్ని టీవీ మీదగాని, షోకేస్‌లో గాని, ఫ్రిజ్ మీద గాని లేదా ల్యాంప్ షేడ్‌గా ఉపయోగించుకోవచ్చు. ఇదేకాకుండా ఫొటోఫ్రేమ్‌లాగా చేసి వాటిలో ఫొటోలను అమర్చుకోవచ్చు లేదా దేవుని మందిరాన్ని, ఇల్లు ఇలా రకరకాలు ఈ ఐస్‌క్రీమ్ పుల్లలతో తయారు చేసుకోవచ్చు.



"వీటా"లో రోజూ ఒక గంట ఇంగ్లీష్ మాట్లాడటం నేర్చుకొన్నాను.

ఇప్పుడు, ఇంగ్లీష్ టీచర్‌లాగ ఇంగ్లీష్ మాట్లాడుతున్నానని అందరూ అంటున్నారు.

గత 25 సంవత్సరాలలో 16 లక్షలమంది వీటాలో ఇంగ్లీష్ నేర్చుకొని వారి జీవితాన్ని మెరుగు పరుచుకున్నారు. మీ జీవితం కూడా మెరుగుపడాలంటే ఈరోజే వీటాను సంప్రదించండి.

HYDERABAD:

S. R. NAGAR	☎ 23714330
DILSUKHNAGAR	☎ 24044352
VANASTHALIPURAM	☎ 24122464
MEHDIPATNAM	☎ 55755888
A.S. RAO NAGAR	☎ 55497992
NARAYANAGUDA	☎ 55155441
RAJAMUNDRY	☎ 2422003
KAKINADA	☎ 2386638
MIRYALGUDA	☎ 230130
NIZAMABAD	☎ 220029
VISAKHAPATNAM	☎ 2738892
VIJAYAWADA	☎ 5530053
GUNTUR	☎ 2238541
NELLORE	☎ 2327702
THIRUPATI	☎ 2252878
CUDDAPAH	☎ 224445
ANANTAPUR	☎ 241029
PRODDATUR	☎ 250550

డైరెక్టు కోచింగు క్లాసులలో చేరలేనివారు మా హోమ్ స్టడీ కోర్స్ మూలంగా ఇంట్లో ఉంటూనే తీరిక సమయంలో ఈజీగా ఇంగ్లీషు నేర్చుకోవచ్చు. మొత్తం కోర్సు ఫీజు రూ. 575/- మాత్రమే. (044) 24347034, 24341216 నెంబరుకి ఫోన్ చేస్తే చాలు. కోర్సు పాఠాలు VPP ద్వారా మీ ఇంటికి వెతుక్కుంటూ వచ్చేస్తాయి.

veta

H.O.: 9, Madley Road, T. Nagar, Chennai - 600 017.

వివేకానందా ఇన్‌స్టిట్యూట్ ఇప్పుడు వీటా

టర్నింగ్ పాయింట్

ఇవ్వాళ అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుఎస్ఏ) ప్రపంచాధిపత్యం కోసం అడ్డదారులు తొక్కుతూ, స్వతంత్ర రాజ్యాల సార్వభౌమత్వానికి ఎసరు పెడుతూ ప్రపంచానికంతకూ రక్షక భటుడిగా (పోలీస్ మాన్) ఉండాలని వువ్విళ్ళూరుతోంది. కానీ, సుమారు, రెండు శతాబ్దాలకు పూర్వం, 18వ శతాబ్దంలో, అప్పటి అమెరికాలోని 13 వలసలు, తమ స్వాతంత్ర్యంకోసం జరిపిన పోరాటం, కొన్ని మహత్తర ఆశయాలపై ఆధారపడడాన్ని తెలుసుకొంటే, ఇప్పటి అమెరికాను ఈసడించుకోక తప్పని పరిస్థితి.

వకుళాభరణం రామకృష్ణ



"తేనీటి విందు"తో ఏర్పడ్డ అమెరికా

18వ శతాబ్దంలోనే, ప్రపంచంలో ఆంగ్లేయుల వలసాధిపత్యానికి ఎదురొడ్డి, 'నూతన ప్రపంచం' లోని 13 వలసలు రాజీలేని పోరాటం, అందులోనూ హింసతో కూడిన విప్లవం లాంటి యుద్ధాన్నే చేశాయి. ఆ యుద్ధగమనంలో 1773లో, బోస్టన్ నగరంలో జరిగిన ఒక ఆసక్తి పూరిత ఘటన అమెరికన్ల పోరాటానికి ఉత్తేజాన్నిచ్చి, ఘర్షణకు తుదిరూపం ఇవ్వడం ఇంగ్లండు, అమెరికాల మధ్య యుద్ధాన్ని అనివార్యం చేసింది. మాసచుసెట్స్ (ఈనాడు అది ఒక రాష్ట్రం), అప్పట్లో అమెరికా తూర్పు తీరంలో ఉన్న ఒక ముఖ్య వలస రాష్ట్రం. వలస స్థాపనలో ముందే ఏర్పడ్డ ప్రాంతం. సంపన్న మైంది. క్రమేపీ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకొంది. వలసలలో మొట్టమొదటి వార్తా పత్రిక, 1704లో న్యూస్‌లెటర్ ఇక్కడి నుండి వెలువడింది.



వీనికి ముఖ్య పట్టణం బోస్టన్ నగరం ఇవ్వాళ ప్రపంచంలోనే అత్యుత్తమ హార్వర్డ్ విశ్వ విద్యాలయం (నోబుల్ బహుమతి గ్రహీత, భారతీయ ఆర్థిక వేత్త అమార్త్యసేన్ అక్కడే ఇప్పుడు బోధిస్తున్నాడు. కాగా అనేక మంది అమెరికా అధ్యక్షులు కెన్నెడీ నుండి నేటి బుష్ దాకా, ఇక్కడిలా విశ్వ విద్యాల యంలోనే చదివారు) ప్రపంచ ప్రసిద్ధి చెందిన మాసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అక్కడే వుందీనాడు. ఇదిలా వుంటే, అమెరికా వల సలు 'బ్రిటీష్ పార్లమెం ట్‌లో ప్రాతినిధ్యం కల్పించనిదే, పన్నులు చెల్లించేది లేదన్న' (నో టాక్సేషన్ వితౌట్ రిప్రజెంటేషన్) నినాదంతో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. వలసల వ్యతిరేకత కారణంగా, బ్రిటీష్ వారు విధించిన టౌన్‌షెండు చట్టాలకు సంబంధించిన పన్నులు ఉపసంహరించుకున్నా, తేయాకుపై పన్ను మాత్రం తొలగించలేదు. తూర్పు ఇండియా కంపెనీ, భారత దేశాన్నుండి తేయాకును అమెరికాకు ఎగుమతి చేసేది. ఈ కంపెనీలో పలుకుబడి కలిగిన బ్రిటీషు పెట్టుబడిదారులకు ఎక్కువ షేర్లుండేవి. విపరీతమైన లాభాలు ఆర్జించేవారు. వారి ప్రయోజనాలను కాపాడ్డానికి, తేయాకుపై పన్ను కొనసాగించేందుకు బ్రిటీష్‌వారే కుట్రపన్నారు. మూడు నౌకల్లో, బోస్టన్ వాసులు, రెడ్ ఇండియన్ల మాదిరి వేషాలు ధరించి, బోస్టన్ రేవులో ప్రవేశించారు. అప్పటికే అక్కడ అశేష ప్రజా సమూహం పోగయింది. వారందరూ ఓడల్లో ఉన్న తేయాకు నిల్వలను సముద్రంలోకి పారపోశారు. అక్కడ గుమికూడిన ప్రజలు ఈ చర్యకు వత్తాసుగా కేరింతలు కొడుతూ, ఆనందంతో గంతులేశారు. ఈ ఘటన ఇంగ్లండుకు పెను సవాలుగా నిలిచింది. ఇంగ్లండు తన సహనానికి ఇదొక పరీక్షగా భావించి, ఇక ఉపేక్షించి లాభం లేదనుకొని, యుద్ధాన్ని ప్రకటించింది. 'బోస్టన్ తేనీటి విందు'గా ప్రసిద్ధికెక్కిన ఈ సంఘటన ప్రపంచ చరిత్రలోనే అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. గాంధీ, దండి సత్యాగ్రహంలో ఒక పిడికెటి ఉప్పు చేతిలో తీసుకొని శాసనోల్లంఘనం చేసిన ఘటనను అమెరికా ప్రజలు తమ దేశంలో 'తేనీటి విందు' ఘటనలో పోల్చుకున్నారు. గాంధీ ఉప్పుసత్యాగ్రహాన్ని 'ఉప్పు విందుగా పేర్కొనడం గమనార్హం 1773లో ప్రారంభమైన అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం, 1776లో స్వతంత్ర్యదేశంగా అమెరికా రూపొందడంతో అంతమైంది. జార్జి వాషింగ్టన్ మొదటి అధ్యక్షుడిగా ఎన్నుకొన్న అమెరికా, తన స్వాతంత్ర్య ప్రకటనలో "మానవులందరూ పుట్టుకతో సమానులు" అని పేర్కొని, సమానత్వ ఆదర్శాన్ని మానవాళి ముందు నిలిపింది.

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

అవినీతిపై న్యాయ విచారణ

'లోకాయుక్త', 'లోక్‌పాల్' అంటే ఎవరు? వీరికి పిటిషన్ పంపించాలంటే ప్రొఫార్మా, ఫీజు ఉంటాయా? వీరిచ్చే తీర్పును సంబంధిత అధికారులు కచ్చితంగా అమలు చేస్తారా? ఒకవేళ చేయకపోతే ధిక్కారం కిందకొస్తుందా ? వీటి చిరునామాలు తెలుపగలరు.

శ్రీనివాస్, కరీంనగర్.

లోకాయుక్త" అంటే రాష్ట్ర పరిధిలో ఉండే అధికారులు వారి యొక్క విధుల్లో జరిగే అవినీతిపై న్యాయ విచారణ జరిపించే సంస్థ. రూ. 7000/- . ఆ పై మూల వేతనాన్ని పొందుతున్న ప్రతి ప్రభుత్వోద్యోగి మీద విచారణ జరిపే అధికారాన్నిది కలిగి ఉంటుంది.

'లోక్‌పాల్' అంటే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగులపై న్యాయవిచారణ జరిపే సంస్థ. ఈ విధుల్లో ఉన్నత న్యాయస్థాన రిటైర్డు న్యాయమూర్తుల్ని నియమిస్తారు.

అవినీతి, కుంభకోణాల గురించి పై సంస్థలకు తెలియజేయవచ్చు. పోస్టు ద్వారా తెలియచేసినా పిటిషన్‌గానే పరిగణిస్తారు. ఈ సంస్థ తన పరిధిలో పోలీస్ డిపార్ట్‌మెంటు అధికారాలు డిప్యూటీ చేయబడతారు. వీరి ద్వారా ఎంక్వైరీ చేయిస్తారు. వారి తీర్పులు తప్పకుండా అమలు చేయవలసుంటుంది. సమాచారం పంపించేవారి పేర్లు వారు కోరితే రహస్యంగా ఉంచుతారు. లోకాయుక్త న్యాయ విచారణ పరిధిలోకి మంత్రుల్ని, ముఖ్యమంత్రిని, ప్రధాన మంత్రిని, ఇతర కేంద్ర మంత్రుల్ని తీసుకురావాలని చాలా రోజుల నుండి అంటున్నారు. కాని ఆ బిల్లు పార్లమెంటులో ఇంకా ఆమోదం పొందలేదు. ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త చిరునామా

"ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త బషీర్‌బాగ్, హైదరాబాద్" అంటే సరిపోతుంది. (బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ చివర్లో ఉంది)





ఇంటి సంగతులు

పి.జ్యోతి

గిదేం వానో ఏమో....

"వా అమ్మో...! వా అయ్యో...!" పొలికేకలు పెడుతూ... పెద్దపెట్టున ఏడుస్తోంది ఆరేళ్ల మంజు.

"ఏందే! గంతగనం మొత్తుకుంటున్న ..ఎవలన్న ఇంటె నీకు పిచ్చిగిట్ల బట్టిందనుకుంటరు. నోర్మూయ్!" అరుస్తోంది రంగమ్మ.

"కాల్లు రెండు బగ్గ బగ్గ మండుతున్నయె.సూద్దూరాయే..." అంది

"ఏందే! ఏవైంది?" అంటూ కూతురి పాదాలను చూసింది రంగమ్మ.

అంతే...

"వా! బిడ్డో... ఏందె గిట్ల కాల్లు రెండు సెక్కల్ సెక్కల్ పగిలినయ్, ఒద్దె పొల్లా! అంటె ఇనకుంట ఇంటి సుట్టున్న పొల్లగాండ్లతోటి గూడి నీల్లల్ల ఆడబడితివి. ఒక్కతీర్న ఆటలా. మాదండి ఆటలు పొద్దుగూకెదాక. గిప్పుడు మంచిగుంద" అంటూ పిల్లలను కసిరింది రంగమ్మ.

రంగమ్మేంటి పనిచేయడానికొచ్చి కూతురితో గొడవపడుతోందనుకుంటూ వెళ్లి చూశా. నన్ను చూస్తూనే...

"గిదేం ఆనో గానీ...యాట్ట పుడుతాంది. ఇంట్లకన్ని నీల్లచ్చి మా తిప్పలుబడ్డం. బుక్కెడు బువ్వ ఒండుకునుడు కట్టమైంది. నీల్లల్ల తడిసీతడిసీ బిడ్డ కాల్లు సూడవ్వ జర...ఎట్ట పాసినయో" అంది మంజు పాదాలు చూపిస్తూ.

నిజమే పాపం దాని చిన్ని పాదాలు పాచిపట్టాయి.

"ఇది దాని పాదాలకు రాయి. అయినా చిన్నది దానికేం తెలుసు నువ్వైనా కాస్త జాగ్రత్తగా చూడొద్దా పిల్లను" అన్నా వ్యాజలెను రంగమ్మ చేతిలో పెడుతూ.

"అయ్యో! ఏంజెప్పమంటవ్ మా తిప్పలు. ఒక్క తీర్నగాదు ఇంట్ల, ఇంటి సుట్టు నీల్లె. గోదారమ్మ తల్లి గింతెత్తు లేసింది. గింతగనం ఎన్నడు జూల్లేదవ్వ. నీల్లల్ల కాల్లు తడిసితడిసీ పిల్లకు కాల్లు గంతగనం పగిలినయ్. దానికే గదవ్వ నాకు సూత పగిలినయ్" అంటూ తన పాదాలను చూపించింది.

"అవును. రంగమ్మ పాదాలూ పాసిపోయాయి"

ఈ వర్షాకాలంలో భోరున వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. రోజులకు రోజులు తెరిపిలేదు. ఎంత వర్షమొచ్చినా... ఇంట్లోనే ఉండటానికి ఎవ్వరికీ వీలుకాదు. ఎవరి పనులు వారు నిర్వర్తించలసిందే!

ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం.

వర్షాకాలంలో ఈగలు దోమలు అధికంగా ఉంటాయి. వీటిని నివారించడానికి రోజూ ఫినాయిలుతో ఇంటిని శుభ్రంగా తుడుచుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. బయటనుండి ఇంట్లోకొచ్చేటప్పుడు కాళ్లు తుడుచుకుని రావాలి.దీని వల్ల తడి ఇంట్లోకి చేరదు. గుమ్మాల దగ్గర నీటిని పీల్చుకునే ఫుట్‌మ్యాట్స్ వేసుంచాలి. నీళ్లల్లో పాదాలు తడిసి కాలివేళ్లు ఒరుసుకుపోయి ఇన్‌ఫెక్షనొస్తుంది. నీళ్లల్లోకెళ్లేముందు చెప్పులేసుకుని నడిస్తే దీన్ని నివారించొచ్చు.

తాగేనీటిని మరిగించి, చల్లార్చుకుని తాగాలి. దీనివల్ల డయేరియా, మలేరియా, న్యుమోనియా, అతిసార వంటి వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు.

వేడిగా ఉన్న పదార్థాలను తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ : 9849130141

ప్రేమించి పెళ్లాడ్డమా... పెళ్లాడి ప్రేమించడమా...

పెళ్లికి ముందు, స్త్రీపురుషులు సాన్నిహిత్యాన్ని పెంచుకుని గడపటం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. పెళ్లై దాంపత్యం చేసుకుంటున్నవారిని చూడండి. వారిలో కాముకప్రవృత్తి, శారీరకోద్రేకం చల్లబడడం ప్రారంభమైన తరువాత, వారిరువురి మధ్య అవగాహన పెరగటం ప్రారంభమౌతుంది. ఫలితంగా ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అదే దాంపత్య ప్రేమకు ప్రారంభ సూచిక. అలాగే టీనేజీ పిల్లలకు ఈ అవగాహన చాలా ముఖ్యం. దీనర్థం "పెళ్లికి ముందే..." అన్న కుష్బూ మాటల్లా కాదు.

ప్రేమ, పెళ్లి వేర్వేరయినప్పటికీ, ఇవి రెండూ ముడిపడున్నాయి. వివాహం పట్ల మనోసాంఘిక దృక్పథం మాత్రం ప్రేమతో బాగా దగ్గర సంబంధం గలది. కాగా యుక్తవయస్కులలో ఏర్పడే మధుర భావనలకు అంత్యబిందువు పెళ్లనీ అదొక్కటే సరైన మార్గమనీ, సమస్యలకు పరిష్కారమనీ మనమనుకోలేం. అలాగని అనుకోవడమూ లేదు. పెళ్లి ప్రసక్తి లేకుండానే కొందరు కలిసి జీవించడం, అర్థవంతంగా కాపురం చేయడం, కట్టుబడి ఉండటం కొన్నిచోట్ల మనం చూస్తుంటాం. ప్రస్తుత పరిస్థితుల్లో అన్నిచోట్లా సాధ్యం కాదు.

వైయుక్తిక అభివృద్ధిపై, సంతృప్తిపై సలహాలిస్తున్న, స్వేచ్ఛాపథం గురించి కొత్త ఆలోచనలను పురికొల్పుతున్న ఎన్నో పుస్తకాలు, మానసిక సలహా కార్యక్రమాలు మనకందుబాటులో ఉన్నాయి. అయితే ఒకరి నొకరు ప్రేమించుకోవటానికి, ఒకరి అవసరాలు మరొకరు తీర్చుకోవటానికి నేటికీ వివాహమనేదొక మౌలికాధారం. (n.o.neil 1987) వివాహానికి ముందు "ప్రేమ" స్థానాన్ని నిర్ధారించినది మన సంస్కృతి మాత్రమే! వివాహం సాంప్రదాయకంగా నిర్ణయించడం, వివాహానికి ముందు సాహచర్యాన్ని నిరోధించడం అలవాటుగా గల సమాజం మనది. పలు ఆసియా దేశాలలో (ఇండియా, చైనా, జపాన్) నిర్ణయించిన పెళ్లిళ్లు సాధారణం. సాంఘిక, ఆర్థిక సమానస్థాయిని ముందే ఆలోచించి వివాహం చేయడం వల్ల కుటుంబ జీవనానికి రంగం సిద్ధం చేసినట్లే. ఈ సామాజిక వాతవరణాన్ని బట్టి, సంస్కృతీశాసనాలను బట్టి, పెళ్లికిముందు వాగ్దానాలు, ప్రేమ లేక పోవడం వల్ల వీగిపోతాయి. కుదిరిన పెళ్లిళ్లలో అంకితభావం, బాధ్యత, తప్ప పరస్పర ప్రేమకు ఆస్కారముండదు. అమెరికా వంటి దేశాల్లో, ఈ సంస్కృతి వేరేరకపు మార్పును సంతరించుకుంది. వివాహానికి ముందు యువతరాన్ని నిర్బంధించటానికి బదులుగా, "ప్రేమ అన్నిటినీ జయిస్తుంది" అనే భావనతో వారుంటారు. అంటే అమెరికా సమాజం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాల పట్ల అమితమైన నమ్మకాన్ని ప్రకటిస్తుంది. అయితే ఇటువంటి సామాజిక జీవనశైలిని సంతరించుకున్న అమెరికాలోనే విడాకుల రేటెక్కువ. దీన్ని వీరు వచ్చిన మార్పు వల్ల పరిణమించిన ఫలితంగా భావించట్లేదు. ఎదుగుతున్న పిల్లల్లో ప్రేమ పై అవగాహన కల్గించడంలో వారు (తల్లిదండ్రులు, విద్యావ్యవస్థ, పెద్దవాళ్లు)

విఫలమౌతున్నారనే సంగతిని విడాకులు బయట పెడుతున్నాయని భావిస్తున్నారు. అమెరికన్లు, ప్రేమను గుర్తించడం, జతగాణ్ణి ఎంచుకోవడం, 'చచ్చేంతవరకూ కలిసుంటాం' అని ప్రమాణం చేసుకోవడం, ప్రేమ ఆధారంగానే జరుగుతుంది. మధ్యలో ఏదైనా తిరగబడితే, ప్రేమించడమెలా అన్నదాని కన్నా, "మసలుకోవటమెలా" అనే విషయంపై యుక్తవయసు పిల్లలకు శిక్షణావసరమని నేటి అమెరికన్లు గుర్తించారు.

కంప్యూటరీ "డేటింగ్' కరక్టేనా!?

రొమాంటిక్ ప్రేమను కోరుకునే వ్యక్తి, పెళ్లి గురించి మాట్లాడడం, దీపం చుట్టూ పురుగు చేరడంలాంటిది. కాల్పనిక ప్రేమలో కోరిక ఒక్కటే ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీని ఫలితంగా ఇద్దరి మధ్యా ప్రణయబంధం కొనసాగి, పరస్పర ప్రేమ మొలకెత్తితే అది వివాహానికి దారితీయొచ్చు. ప్రేమ మొలకెత్తక పోతే, కోరిక నశించాక, తొలగిపోయే ప్రేమ గురించి శాశ్వత నిర్ణయాలు చేయలేం. పెళ్లి చేసుకోబోయే వ్యక్తిని శాస్త్రీయంగా, గణాంకాలతో విశ్లేషించి చేసుకోవాలని చెప్పడం మా ఉద్దేశం కాదు. డేటింగ్ విషయంలో సరైన జతగాణ్ణి కుదిర్చిపెట్టే కంప్యూటరుంది. పూర్తి భద్రతనందించే సిద్ధాంతాన్ని ఏ యంత్రమూ ఇవ్వలేదు. జీవితంలో చాలా విషయాలకు మల్లె జీవిత భాగస్వామినెన్నుకోవడమూ మీ వైయుక్తిక తెలివితేటలపై ఆధారపడి ఉంటుంది.

ఎవరికి ఎవరు తగుజోడీ?!

మీ మనసులో ఏర్పడిన స్ఫూర్తిని బట్టి, "ఫలానా వ్యక్తి నాకు సరిపోతాడు. అతనితో నా జీవితమానందంగానే గడుస్తుంది" అని మీకనిపిస్తుంది. తాము కోరుకున్న లక్షణాలున్నాయా? హెచ్చుతగ్గులున్నాయా? అన్నది తెలివితేటలతో అంచనావేసుకుని తెలుసుకోవాలి. ఏ మాత్రం ఎక్కువయినా, తక్కువయినా సంఘర్షణ తప్పదు. సమానత్వ సిద్ధాంతం ప్రకారం, మనకు తెలిసేదేమిటంటే స్త్రీ పురుషులు సాధారణంగా, సమాన శారీరకాకర్షణ, బుద్ధికుశలత, అన్వయంచుకునేగుణం వీటినే చూసుకుంటారు. సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, సంస్కృతి పరంగా, బాగా తేడా గల వ్యక్తిని చేసుకున్నందువల్ల మీకు నచ్చిన ప్రవృత్తులున్నప్పటికీ, సంఘర్షణలేర్పడొచ్చు. అయితే ఇక్కడ మనుషుల ఎంపిక విభిన్నంగా ఉంటోంది. ఒక్కోసారి... కొందరు "మనసు చెప్పింది" వింటే మరికొందరు "హృదయం చెప్పింది" వింటున్నారు. కొన్నాళ్లకు వీరిలో కొందరు తమ వైఖరులను మార్చుకుంటున్నారు.

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...

గడువు ప్రకారం గాలవుడు వచ్చి పచ్చిబాలింతరాలని కూడా చూడకుండా తల్లీ బిడ్డలను వేరు చేసి తన వెంట కాశీపురానికి ప్రయాణం కట్టాడు. ముందు ఈర్ష్యపడ్డ మహారాణి కూడా మాధవి ఆవేదనను అర్థం చేసుకుంది. మాధవి కొడుకుని ఏ లోటూ రాకుండా చూస్తానని మాటిచ్చింది. ఏడాదిపాటు మాధవిననుభవించినందుకు, వంశాకురాన్ని కనిచ్చినందుకు గాలవుడికి ముట్టిన రెండొందల గుర్రాలను హర్యశ్వుడి వద్దే ఉంచమని మిగిలిన గుర్రాలను సంపాదించడానికి మాధవిని తోడ్కొని బయలుదేరాడు.

(14వ భాగం)

మాధవి ఎంత వేగంగా నడిచినా గాలవుడితో సమంగా నడవలేకపోతోంది. ప్రసవం తర్వాత బాగా శక్తిహీనంగా అనిపిస్తోంది. స్తనాలు పాలతో నిండి బరువుగా వున్నాయి. పసివాడికి పాలిచ్చే

అదృష్టానికి నోచుకోకుండా చేసిన ఈ నీచబ్రాహ్మణుడితో వెళ్తోన్న తనమీద తనకే కోపం వస్తోంది. 'నా బిడ్డకంటే నీ గురుదక్షిణ గొప్పదా?' అని ఎందుకు ప్రశ్నించలేకపోయాను? ఇప్పుడు వగచేం లాభం, అసలు ఆనాడు తండ్రినే ఎదిరించాల్సింది. అన్న, వస్త్ర, ధనాల్లా కూతుర్ని దానం చేయడమేంటి? ప్రాణమైనా తీయండి కానీ నేనతడితో వెళ్ళను అనుండాల్సింది' అనుకుంది మాధవి దిగులుగా.

"ఏం మాధవీ, నడవలేకపోతున్నావా? ఇంత నత్తనడక నడిస్తే మనం కాశీ చేరేసరికి వృద్ధులమౌతాం" అన్నాడు గాలవుడు.

కొడుకును తనకు దూరంచేసిన అతనితో మాట్లాడాలనిపించక మౌనంగా వుండిపోయింది.

"కాశీరాజు దివోదాసు అశ్వమేథయాగాలు చేస్తాడని విన్నాను. ఆయన తక్కిన గుర్రాలు తప్పక ఇస్తాడని నమ్ముతున్నాను" అన్నాడు గాలవుడు.

'అంటే మరో రాజుకు తనను విక్రయిస్తాడన్నమాట. వస్తువును మారకం వేసినట్లు తనని అతనికి అప్పగించి గుర్రాలను పొందుతాడు. ఇంత అన్యాయం ఇంకెక్కడైనా వుంటుందా? చదువుసంధ్యలు నేర్చినవాడు ఇంత హీనంగా ప్రవర్తించడమేంటి? ఇతన్ని ఎదిరించే శక్తి తనకి లేదా? ఈ ఘోరాన్ని ఎవరూ ఆపలేరా?' అనుకునేసరికి దఃఖం పొంగుకొచ్చింది.

ఆలోచనలతో నిమిత్తం లేకుండా నడక సాగుతోంది. సుమారు రెండు యోజనాలు నడిచారు. గాలవుడు మధ్యలో ఏదో మాట్లాడుతూనే వున్నాడు. మాధవి మాత్రం బదులివ్వడంలేదు. ఒంట్లో సత్తువ లేకున్నా బలవంతంగా నడుస్తోంది.

ఆమె ఎంతకీ మాట్లాడకపోయేసరికి "ఇంత మౌనాన్ని భరించడం చాలా కష్టం మాధవీ. ఏమైనా మాట్లాడరాదూ, మాట్లాడుతూ నడిస్తే అలసట అనిపించదు. నీకో సంగతి చెప్పనా? మనం వెళ్ళాల్సిన కాశీనగరం గంగానదికి ఉత్తరతీరంలో వుంటుంది. గంగలో మునిగితే ఎలాంటి పాపమైనా పరిహారమౌతుందంటారు విన్నావా?" అన్నాడు గాలవుడు.

'శరీరానికి అంటిన మురికైతే ప్రక్షాళనం చేసుకోవచ్చు కానీ చేసిన పాపాలెలా పరిహారమౌతాయి నీ పిచ్చి కాకపోతే. నన్ను ఏడిపించిన పాపం లక్షసార్లు మునిగినా పోదులే' అనుకుంది మాధవి.

"నాకు బొత్తిగా శాంతి లేకుండా పోయింది మాధవీ, ముక్కు మూసుకుని తపస్సు చేద్దామన్నా ఏకాగ్రత కుదరడంలేదు. ఎప్పుడూ ఆ గుర్రాల గురించే ఆలోచన. గురుదక్షిణ చెల్లించేవరకూ మనశ్శాంతి దొరికేలా లేదు" అన్నాడు గాలవుడు.

'అయితే ఇన్ని నెలలూ నన్నెవరికి అప్పగిస్తే తక్కిన గుర్రాలు దొరుకుతాయనే ఆలోచనతోనే గడిపావన్నమాట' అనుకుంది ఉక్రోషంగా.

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

“కన్నబిడ్డను వదిలి రావడమంటే కష్టమే, నేనేం కాదనను. కానీ మాధవీ, నువ్వు ఇహలోకమే పెద్ద మాయాజగత్తని తెలుసుకోవాలి. పరలోక చింతన వున్నట్లయితే ఇక్కడి మోహాలెంత తుచ్ఛమో నీకే అర్థమౌతుంది. నిన్నొక పుణ్యకార్యానికి సాధనంగా ఉపయోగిస్తున్నాను తెలుసా?!” అన్నాడు గాలవుడు.

‘ఎంత మాయగాడివి నాయనా?! ఎన్ని బూటకపు మాటలు చెప్తున్నావు? మరి నీ గురుదక్షిణ ఇహలోకానికి సంబంధించింది కాదా? విశ్వామిత్రుణ్ణి సంతృప్తిపరచి ఏవో శక్తులు సాధించాలన్న తపనేం నీకు లేకపోతే పరలోక చింతనతో తపస్సే చేసుకునేవాడివిగా. నన్ను ఎరగాపెట్టి గుర్రాలు సంపాదించాలని చూస్తూ పుణ్యకార్యం, గొంగూరా అంటూ మభ్యపెడుతున్నావా?’ అనుకుంది పళ్ళు నూరుతూ.

పక్కనే సెలయేరు పారుతుంటే దోసిలితో నీళ్ళు తాగి అలసటగా వుండటంతో అక్కడే ఒక రాయిమీద కూర్చుంది. గాలవుడు కొన్ని పండ్లిచ్చాడు. అవి తింటూ తల్లిపాలకు అలవాటుపడిన తన కొడుకు ఆవుపాలు తాగాడో లేదోనని తల్చుకుని బాధపడింది.

చీకట్లు పడేవరకూ నడక సాగించి సమీపంలో వున్న ఖాళీ ఆశ్రమంలో సేదతీరారు. మాధవికి శరీరం తేలిపోతున్నట్లుగా వుంది. అక్కడున్న జింకశరీరంపై పడుకోగానే నీరసంతో కూడిన మత్తు ఆవరించింది. ఆ పడుకోవడం మరుసటిరోజు ఉదయం తొమ్మిదైనా మెలకువ రాలేదు. కళ్ళు మూసుకుపోతున్నట్లున్నాయి. గాలవుడు లేపడంతో బలవంతంగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసేసరికి చలితో ఒణికిపోయింది. అతడిచ్చిన పండ్లు, చిలగడదుంప తినబోతే సహించలేదు. బలవంతంగా కొన్ని తిని కొడుకును గుర్తుచేసుకుంటూ దిగులుగా కూర్చుంది. “బయల్దేరు మాధవీ, ఎండ వేళైతే నడవలేవు” అని గాలవుడు తొందరపెట్టడంతో నిర్లిప్తంగా లేచింది.

ఎటుచూసినా దట్టమైన చెట్లు, పొదలతో అడవిలో ఎండ ఛాయే లేదు. చల్లటిగాలి వీస్తూ బాగా చలేస్తోంది. చీరచెంగును చెవులమీదుగా ముసుగు వేసుకుని భుజాలనిండా కప్పుకున్నా చలి తగ్గలేదు. ఇంతలో సన్నటిజల్లు కూడా ఆరంభమైంది. ఒక మర్రిచెట్టుకింద ఆగారు. మాధవికి నిలబడే ఓపికలేక ఆ చెట్టుకిందే కూలబడింది.

కొద్దిసేపు గడిచిందోలేదో “జల్లు తగ్గింది మాధవీ, ఇంక నడుద్దాం పద” అనడంతో నిస్సత్తువగా లేచింది.

కొడుకుమీది బెంగతో మానసికమైన దిగులు ఒకవైపు, ఒళ్ళంతా నొప్పులు, గజగజలాడిస్తోన్న చలితో శారీరక బాధ మరోవైపు... అయినా నిగ్రహించుకుని నడుస్తోంది. అలా చాలాదూరం నడిచాక కళ్ళు తిరుగుతోంటే కూర్చుని కణతలు పట్టుకుంది. మరునిమిషంలో పక్కకు వాలిపోయింది.

ఇదేం గమనించని గాలవుడు అంగలుపంగలేసుకుంటూ నడుస్తూ ఎంతోదూరం వెళ్ళాక వెనక్కి తిరిగి చూశాడు. మాధవి పడిపోయి వుండటం చూసి కంగారుగా వచ్చి పలకరించాడు. జవాబు లేకపోయేసరికి పామేదైనా కరిచిందేమోనని భయపడ్డాడు. అలాంటిదేమైనా జరిగితే నోటివెంట నురుగులు వస్తాయి కదాని తనకు తానే సమాధానపడి నుదురుపట్టుకుని చూస్తే సెగలు కక్కుతున్నట్లు వేడిగా వుంది. వెంటనే అటూఇటూ పరిగెత్తి ఆశ్రమంకోసం వెదికితే కొద్దిదూరంలో కనిపించింది. అదృష్టవశాత్తూ అందులో ధారుణిరుషి, ఆయన భార్య, కొందరు శిష్యులు కూడా వున్నారు. రుషివద్దకు వెళ్ళి క్లుప్తంగా పరిచయం చేసుకుని, మాధవి స్పృహతప్పి పడిపోయిన సంగతి చెప్పి సహాయం చేయమని కోరాడు. రుషి ఎంతో ఔదార్యంతో ఒక నులకమంచాన్ని, నలుగురు శిష్యుల్ని ఇచ్చి పంపాడు. వాళ్ళు మాధవిని దానిపై పడుకోబెట్టి తెచ్చారు.

రుషిపత్ని వేదవతి మాధవికి శుశ్రూషలు చేసింది. కాలిపోతున్న శరీరంపై తడిబట్టతో తుడిచి, గోరువెచ్చటి పాలు గరిటె సాయంతో కొద్దికొద్దిగా నోట్లో పోయడంతో మాధవి కొంచెం సేదతీరింది. కొద్దిసేపటికి తానున్న కొత్తచోటు గురించి అయోమయంగా అనిపించినప్పటికీ నోరు మెదిపే ఓపికైనా లేక



మౌనంగా కళ్ళు మూసుకుని పడుకుంది.

“నాయనా విశ్వామిత్రుడి శిష్యుణ్ణన్నావు... ఇంతకీ ఎక్కణ్ణించి వస్తున్నావు, ఎక్కడికెళ్తున్నావు? దేవకన్యలాంటి ఈ అమ్మాయెవరు?” అని ధారుణిరుషి అడిగిన ప్రశ్నకు జరిగిందంతా వివరించి చెప్పాడు గాలవుడు.

రుషి ఏమీ అనలేదు కానీ వేదవతి మాత్రం “ఇదేం పద్ధతయ్యా?! బాలింతరాల్ని పసిబిడ్డతో సమానంగా చూస్తారు. అలాంటిది గాలీవానా అని చూడకుండా ఇలా అడవిలో నడిపించుకొస్తావా? కనీసం ఈ ఆగడాన్ని ఇతర్లు కూడా అడ్డుకోలేదా?” అంది కోపం తమాయించుకోలేక.

“కొడుకు పుట్టి రెండునెలలు దాటిందిలెండి, ఇపుడింక మామూలు మనిషికిందే లెక్కకదా” అన్నాడు గాలవుడు.

‘చూడబోతే నువ్వు మామూలు మనిషిలా లేవు. పేగుబంధాన్ని తెంపి, అమ్మాయిని బలిపశువుగా నడిపించుకొస్తోంది చాలక ఇంకా నోటికొచ్చింది వాగుతున్నావా?’ అనుకుని ‘ఏం మాట్లాడుతున్నావయ్యా, ప్రసవం తర్వాత ఒళ్ళెంత పచ్చిగా వుంటుందో తెలుసా?! అంది వేదవతి.

“అలాంటి విషయాలు నాకేం తెలుస్తాయండీ?” అని ఎదురు ప్రశ్న వేశాడు గాలవుడు.

“కనీసం ఆడపిల్లన్న కనికరం కూడా లేదా? ఆ పిల్ల చనిపోతే ఏం చేస్తావు?!”

“అయ్యో అంత మాటనకమ్మా, మాధవి చనిపోతే ఎలా? నా గురుదక్షిణ తీరేవరకూ ఆమె చావకూడదు” అన్నాడు ఆదుర్దాగా.

ఆ మాటతో వేదవతికి జుగుప్స కలిగి ఇక అక్కడ నిలబడలేక బయటకు వెళ్ళింది. మాధవి దయనీయస్థితి గురించి తెలియడంతో ఆమెపట్ల మరింత కరుణ కలిగింది. అలాంటప్పుడు జ్వరం సోకితే ఏం చేయాలో ఆవిడకి బాగానే తెలిసినందున దగ్గర్లో వున్న మూలికలు, ఆకులు వెతికితెచ్చి కషాయం తయారుచేసి పాలల్లో వేసి మాధవిచేత తాగించింది.

మరుసటిరోజు ఉదయానికి జ్వరం తగ్గకపోయినా ఒళ్ళునొప్పులు, తలభారం తగ్గింది. వేదవతికి కృతజ్ఞతలు చెప్పుకుంది మాధవి. ఆవిడెంతో ప్రేమగా కనిపెట్టివుండి సేవచేస్తూ అవసరమైన ఔషధాలు వాడటంతో మూడురోజులకు జ్వరం తగ్గింది.

ఆమెకి జ్వరం తగ్గిందని వినగానే గాలవుడిలో ఎక్కడలేని ఉత్సాహం ఉరకలేయగా “అయితే ఇక మేం బయల్దేరుతాం అమ్మా” అన్నాడు వేదవతిని ఉద్దేశించి.

వేదవతిలో ఆగ్రహం బుసలుకొట్టగా “ఏం మునికుమారుడివయ్యా నువ్వు?! కాస్తయినా బుద్ధిలేదా?! నీ అదృష్టం బాగుండి మాధవి బ్రతికింది కానీ ఒకవేళ చనిపోతే ఏం చేసేవాడివి?! స్త్రీ హత్య మహాపాతకమని తెలీదా? గురుదక్షిణ చెల్లించడం మాటలా వుంచి మహాపాపం నీ మెడకు చుట్టుకునేది” అంది.

గాలవుడు ప్రాన్పడిపోగా వేదవతి తనను తాను సంబాళించుకుని “నేను చెప్పేవరకూ ప్రయాణం మాటెత్తకు” అంది.

గాలవుడు పాలిపోయిన ముఖంతో తల పంకించాడు.

... ఇంకా ఉంది

మునిపత్ని వేదవతి చెప్పిన మాటలు గాలవుడి తలకెక్కాయా?

గురుదక్షిణ గుర్రాలకై మాధవిని కాశీపురానికి తీసుకెళ్ళకుండా ఉన్నాడా?

కాశీపురానికి తీసుకెళ్ళి అక్కడ ఏ రాజుకి మాధవిని అప్పగించాలని చూశాడు?

వచ్చే వారం....

క్యాంపస్ ఛాట్

కె శివలీల

పెళ్ళికి ముందే...

"పెళ్లికి ముందు సెక్సు తప్పుకాదు... సుఖవ్యాధులు, గర్భం రాకుండా జాగ్రత్త తీసుకుంటే చాలు" అని ప్రముఖ నటి ఖుష్బూ ఇచ్చిన ఇంటర్వ్యూ వడిన వత్రిక క్యాంవస్‌లో రహస్యంగా సర్క్యులేటవుతోంది. ఈ విషయంపై కొందరి మధ్య ఇష్టంగానూ, మరికొందరి మధ్య అయిష్టంగానూ చర్చ సాగుతోంది.

"సెక్సు గురించి అవగాహన అందరికీ అవసరమే. కానీ ప్రాక్టికల్ నాలెడ్జీ ఉండాలనుకోకూడదు. ఈ రోజుల్లో వివాహానికి ముందే సెక్సులో పాల్గొనేవారున్నారు. వీరిని చూసి చాలామంది అమ్మాయిలు 'తామూ అలా ఉండొచ్చు కదా' అనుకుంటారు. ఇలాంటి సంబంధాలు కొందరి జీవితాల్లో ఎలాంటి ప్రభావాన్నీ చూపకపోవచ్చు. కానీ అందరి విషయంలోనూ ఇలా ఉండదు సరికదా వారి జీవితమే గందరగోళంగా మారిపోతుంది" అంటోంది సంధ్య. మీడియాలో వస్తున్న పాశ్చాత్య పోకడల వల్ల కొందరు చెడిపోతే... దాన్ని చూసి మరికొందరు ప్రలోభానికి గురౌతున్నట్లు ఈమె మాటల్లో మనకు తెలుస్తుంది.

"కుష్బూ చెప్పిన మాటలు ఈ రోజు సంచలనాత్మకంగానే ఉండొచ్చు. కానీ కొన్ని రోజుల తర్వాత ఈ విషయం మనకు మామూలైపోతుంది. కొన్ని సంవత్సరాలకిందట అబ్బాయిలతో ఫ్రీగా మాట్లాడ్డం, బోయ్ ఫ్రెండ్స్‌తో బయటికెళ్లడం లాంటివి విన్నప్పుడు అందరూ ఇలాగే స్పందించారు. కానీ ఇప్పుడివి కామనయిపోలేదా? అలాగే కొన్ని రోజుల తర్వాత కుష్బూ చెప్పిన మాటలు తప్పుగా అనిపించకపోవచ్చు. ఏదేమైనా భారతీయ, పాశ్చాత్య సంస్కృతులు ఎప్పటికీ ఒకటి కాకూడదనే కోరుకుందాం" అంటోంది కాత్యాయని.

"గాళ్ ఫ్రెండన్న తరువాత బైక్ మీద షికార్లు... క్యాండిల్ లైట్ డిన్నర్లూ... డిస్కోథెక్‌లు... కామన్! అలాంటప్పుడు మాకిష్టమైన గర్ల్ ఫ్రెండ్సుతో ఇలాంటి సంబంధాన్నాశించడంలో తప్పేంటి? దీనికంతలా ఫీలవ్వడమెందుకు? జీవితాంతం మాతోనే ఉండమనట్లేదు కదా?'' అని తన వాదనను

సమర్ధించుకోవడానికి ప్రయత్నించాడో అబ్బాయి. పాశ్చాత్య దేశాల సంస్కృతి, విచ్చలవిడితనం నేటి యువతపై ఎంతగా ప్రభావాన్ని చూపుతోందో మనకితని మాటల్లో అర్థమౌతుంది. ఇతను ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాడు. పైగా అదే సరైందంటూ సమర్ధించుకుంటున్నాడు.

మీ ఆలోచనలిలా ఉన్నాయని మీ వాళ్లకు తెలిస్తే... అన్న ప్రశ్నకు... "సిగరెట్టు, డ్రింక్... లాంటి అలవాట్లన్నీ నాకున్నాయి. కానీ వారింతవరకూ నన్నేం అనలేదు. అంటే ఈ అలవాట్లు నాకున్నట్లు వారికి తెలీదనా?" అని ఎదురు ప్రశ్నించాడతను. తానిష్టపడేది జీవితాంతం కలిసుండడానికి కాదనీ, ఒక్కసారి అనుభవానికే తన ఇష్టం పరిమితమనీ తేల్చిచెబుతున్న ఈ యువకుడు, తనయుడు తప్పుచేస్తున్నాడని తెలిసినా గమనించనట్లు ప్రవర్తిస్తున్న అతని తల్లిదండ్రులు ప్రపంచీకరణ ప్రభావానికి నిలువెత్తు నిదర్శనాలు.

ఇతని భార్య ఇతన్నే "ఆదర్శం"గా తీసుకుంటే... "జీవితాంతం నేనతనితో వెళ్లట్లేదు కదా? ఎందుకంతగా ఫీలౌతారు?" అని సమాధానమిస్తే... అప్పుడీ 'విశాల' హృదయుడు సహించగలడా?

"ఈ రోజుల్లో దాదాపు చాలామందికి ఐదారుగురు బోయ్ ఫ్రెండ్సున్నారు. తప్పేం లేదు. వారి మనస్తత్వమెలాంటిదో మనం చూస్తూనే పసిగట్టగలగాలి. వారి ప్రవర్తన సరైనదైతేనే ఫ్రెండ్‌షిప్ కంటిన్యూ చేయాలి. వారి మనసులో భావాల్ని తెలుసుకోవడం కోసం డేటింగ్, లివిన్ రిలేషన్‌షిప్ లాంటివే అవసరమంటే...దాన్ని నేను పూర్తిగా ఖండిస్తాను" అంటోంది సాహితి.

"ఈ రోజుల్లో బోయ్ ఫ్రెండ్స్ కామన్. వీరందరూ మంచివాళ్లనీ కచ్చితంగా చెప్పలేం. తాత్కాలికంగా మంచివాళ్లలా కనిపించినా... కొద్దిరోజుల తర్వాత వారిలో తేడా వస్తుంది. దాన్ని చూచాయగా మనం గమనించినప్పుడే వారిని దూరంగా ఉంచడానికి ప్రయత్నించాలి" అంటోంది వినోద.

పెళ్లికి ముందున్న సంబంధాలన్నింటినీ పెళ్లయిన తరువాత ఆమె లేదా అతను మర్చిపోగలరా? అది నిజంగా సాధ్యమౌతుందా? ఒకవేళ మర్చిపోలేకపోతే... వారి వైవాహిక జీవితం సంగతేంటి? వారి పిల్లల భవిష్యత్తు మాటేంటి? అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. లాభనష్టాలు బేరీజు వేసుకోవాలి. ఇవన్నీ ఆలోచించక...తొందరపాటుతో, అవగాహనారాహిత్యంతో నిర్ణయం తీసుకుంటే... ఆ తర్వాతది పొరబాటని తెలిసినా... దాన్ని సరిదిద్దుకోవడానికి జీవితకాలం సరిపోదేమో.....

సినిమా కబుర్లు

తెరవెనుక

బ్యానర్	-	ఈస్ట్ ఇండియా ఫిలిం
స్క్రీన్ ప్లే	-	వల్లభజోస్యుల రమణమూర్తి
మాటలు-పాటలు	-	బలిజేపల్లి లక్ష్మీకాంత కవి
సంగీతం	-	ప్రభల సత్యనారాయణ
దర్శకత్వం	-	చిత్తజల్లు పుల్లయ్య.

పులగం చిన్నారాయణ

తొలి తెలుగు సూపర్ హిట్ 'లవకుశ'

సీతారాముల వియోగం, లవకుశల జననంతో కూడిన రసవత్తర సి. పుల్లయ్య రూపొందించిన చిత్రం 'లవకుశ'.

తెలుగు సినిమాకు పునాదేసిన వారిలో బహుముఖ్యుడు చిత్తజల్లు పుల్లయ్య, కాకినాడకు చెందిన ఈయన బి.ఎ. పూర్తయ్యాక ముంబైకి వెళ్లి సినిమాటోగ్రఫీలో శిక్షణ పొందారు. 1922లో కోహినూర్ ఫిలిం కంపెనీలో చేరి అన్ని శాఖల్లోనూ నైపుణ్యం సంపాదించారు. మద్రాసులో రఘుపతి వెంకయ్య స్టార్ ఆఫ్ ది ఈస్ట్ ఫిలింస్ లిమిటెడ్ అనే కంపెనీని నెలకొల్పి మూకీ చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించారు. వెంకయ్య కుమారుదు ఆర్.ఎస్. ప్రకాష్ 'భీష్మ ప్రతిజ్ఞ' తీస్తుంటే ఆయన దగ్గర సహాయకునిగా చేరారు పుల్లయ్య. మరి కొంతకాలం తర్వాత తానే కెమెరా, లైట్లు కొని, కాకినాడలో తన ఇంట్లోనే సెట్లువేసి 'మార్కండేయ' తీశారు. అప్పట్లో ఆంధ్రాలో థియేటర్లు లేవు. సినిమా చూడాలంటే మద్రాసుగానీ, కలకత్తాగానీ వెళ్ళాల్సిందే. దాంతో పుల్లయ్య కాకినాడలో 'సిటీ ఎలక్ట్రిక్ సినిమా' పేరుతో 1923లో ఒక చిన్న థియేటర్ నిర్మించారు. ఆ థియేటర్ 'మినర్వా' పేరుతో ఇప్పటికీ నడుస్తోంది.

టాకీల నిర్మాణం ప్రారంభమయ్యాక సినిమాను లాభసాటి వ్యాపారంగా భావించి కలకత్తాలోని మార్వాడీలు నిర్మాతలుగా మారడం మొదలుపెట్టారు. అలా బి.ఎల్. కెమ్కా 'ఈస్టిండియా ఫిలిం కంపెనీ' స్థాపించి, తెలుగులో చిత్రాలు రూపొందించే బాధ్యతను సి. పుల్లయ్యకు అప్పగించారు.

ఈస్టిండియా ఫిలిం వారు బెంగాలీలో దేవకీబోస్ దర్శకత్వంలో 'సీత' చిత్రాన్ని నిర్మించారు. అందులో పృద్వీరాజ్‌కపూర్ రాముడిగా దుర్గాఖోటే సీతగా నటించారు. ఈ సినిమా ఘనవిజయం సాధించడంతో బి. ఎల్, కెమ్కాకు తెలుగులో అదే సినిమాను రూపొందించాలన్న ఆలోచన కలిగింది. పుల్లయ్య కూడా కె. సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన 'లవకుశ' నాటకాన్ని తెరకెక్కించాలన్న కోరిక ఉంది. అలా దర్శక నిర్మాతలు చాలా ఇష్టపడి 'లవకుశ'ను మొదలుపెట్టారు.

దేవకీబోస్ అడుగుజాడల్లో 'సీత' తీయాలని బి.ఎన్.రెడ్డి ఓ స్క్రిప్ట్ రాసుకున్నారు. ఈ స్క్రిప్ట్ ఎన్టీఆర్ దగ్గరే ఉంది.

బెంగాలీ 'సీత' కోసం వేసిన సెట్లు, కాస్ట్యూమ్స్ రథాలు వగైరాలను ఈ 'లవకుశ' కోసం ఉపయోగించారు. 'లవకుశ' నాటకంలో నటించిన నటీనటుల్ని కాక సినిమా కోసం ప్రత్యేకంగా కొందర్ని ఎంపిక చేసుకున్నారు. పుల్లయ్య 'రాధాకృష్ణ' నాటకంలో రాధ పాత్ర పోషణలో మంచి పేరు తెచ్చుకున్న పారుపల్లి సుబ్బారావును ఈమని వెంకట్రామయ్యను లక్ష్మణుని పాత్రకు శ్రీరాముని పాత్రకు అతన్ని ఎన్నుకున్నారు.

'లవకుశలో సీతగా చేసిన సీనియర్ శ్రీరంజనికి ప్రజలు మంగళహారతులు పట్టారు. పత్రికల్లో వచ్చిన ఆమె ఫొటోలను కత్తిరించి ఇళ్లల్లో అతికించుకునేవారు. పాటలు జనంలోకి వెళ్లి హిట్టయి పాడుకోవడం ఆరంభమైంది. ఈ చిత్రంలోని 'రఘురాముని చరితము వినవమ్మా', 'సత్య పాలనాఘనా' మొదలైన పాటలు వల్లెటూరి ప్రజలనోట బాగా నానాయి.

తెలుగు సినిమా పాటలు రికార్డులుగా రావడమన్న ప్రక్రియ 'సతీ సావిత్రి'తో మొదలైనా లవకుశతో ఊపందుకుంది. కాకినాడలోని సన్ రికార్డింగ్ కంపెనీ ఈ చిత్రంలోని పాటలను రికార్డులుగా విడుదల చేసింది. సినిమా పాటల పుస్తకాలు ప్రచురించి చేసి అమ్మడమనేది ఈ సినిమాతోనే మొదలైంది.

ఈ సినిమా చూడటానికి మారుమూల పల్లెల నుండి ప్రజలు బళ్ళు కట్టుకొని మరీ వచ్చేవారు. థియేటర్ల దగ్గర తిరునాళ్ల వాతావరణం కనిపించేది. ఆ రోజుల్లోనే ఈ చిత్రం నలభైవేల రూపాయలు వసూలు చేసి రికార్డ్ సృష్టించడమేగాక, తొలి తెలుగు సూపర్‌హిట్ ఫిలింగా చరిత్రలో నిలిచిపోయింది. కొన్ని థియేటర్లలో ఈ చిత్రాన్ని ఏడాదికి పైగాప్రదర్శించారు. చేసింది. ఆ రోజుల్లో థియేటర్లలో ప్రింట్ ఆడేందుకు కాంట్రాక్టు పద్ధతి ఉండేది. కాని గడువు తీరాక కూడా థియేటర్ వాళ్ళు ప్రింట్‌ని పంపించేవారు కాదు. ఎందుకంటే ఎన్ని రోజులైన ప్రేక్షక ప్రవాహం తగ్గేది కాదు. దాంతో మిగతా ఊరివాళ్ళు అగ్గిమీద గుగ్గిలమైపోయేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈస్టిండియా కంపెనీ వారు కలకత్తాలోని 'చటర్జీ-భూపాల్' సౌండ్ సిస్టమ్ వారితో అగ్రిమెంట్ కుదుర్చుకుని సింగిల్ స్టార్ సింప్లెక్స్ ప్రొజెక్టర్‌ను ప్రవేశపెట్టారు. అంతకు ముందు థియేటర్స్‌లో సినిమా ఆడించేందుకు మేకులు కొట్టి చెక్క ముక్కలతో ప్రొజెక్టర్ తయారు చేసే ప్రక్రియ ఉండేది. ఈ సింగిల్ స్టార్ ప్రొజెక్టర్ రావడంతో ఆ పాత పద్ధతికి తెరపడింది. ఇలా 'లవకుశ' తెలుగు సినిమా ఎదుగుదలకు పెద్దమేలు చేసింది.

'లవకుశ'ను పూర్తిగా స్టేజి నాటకం ఆధారంగానే తీసినా, నటనాపరంగా, సాంకేతికపరంగా మెరుగైన ప్రమాణాలను కనబరిచింది. తెలుగువారు చిత్ర నిర్మాణంలోకి దిగడానికి ఉత్సాహాన్నిచ్చింది 'లవకుశ' కథాంశంతో ఇప్పటి వరకూ వివిధ భాషల్లో 11 సినిమాలు రూపొందాయి. 1919లో ఆర్. నటరాజ్ ముదలియార్ మూకీ చిత్రం నిర్మించారు.

తెలుగులో మాత్రం ఇదే తొలి ప్రయత్నం ద్వితీయ ప్రయత్నం, కూడా పుల్లయ్యే చేశారు. అయితే మొదటి నలుపు-తెలుపుల్లో కాగా, రెండోది సంపూర్ణ వర్ణ చిత్రం పాతికేళ్ల తర్వాత ఎన్టీఆర్ అంజలీదేవితో ఈ సినిమాను చిత్తజల్లు రూపొందించారు. ✠

తెరపై

శ్రీరాముడు	-	పారుపల్లి సుబ్బారావు
లక్ష్మణుడు	-	ఈమని వెంకట్రామయ్య
భరతుడు	-	కె. నాగమణి
శతృఘ్నుడు	-	చారి
వాల్మీకి	-	పారుపల్లి సత్యనారాయణ
వశిష్టుడు	-	మద్దూరి బుచ్చన్న శాస్త్రి
భద్రుడు	-	కె. రామచంద్రరావు
సీత	-	సీనియర్ శ్రీరంజని
రజకుడు	-	డాక్టర్ సి. హెచ్. బి వెంకటాచలం
రజకుని భార్య	-	పద్మాబాయి
లవుడు	-	మాస్టర్ భీమారావు
కుశుడు	-	మాస్టర్ మల్లేశ్వరరావు

చిన్నారి చిత్రకారులు

జె.మానస, 3వ తరగతి, కేంద్రీయ విద్యానికేతన్,
టెలికాంనగర్, నంద్యాలరోడ్, కర్నూలు

జె.రవితేజ, 1వ తరగతి, కేంద్రీయ విద్యానికేతన్,
టెలికాం నగర్, నంద్యాల రోడ్, కర్నూలు.



చేప వున్న గేలం ఏది?



బుజ్జాయిలూ! దసరా సెలవులుకదా. అందుకని కొంత మంది నేస్తాలు సరదాగా పడవలో చేపల వేటకు వెళ్లారు. గేలాలు వేసి చేపలకోసం ఎదురు చూడసాగారు.

కాసేపటికి వారి గేలాలు బరువయ్యాయి. అంతే చేపలు పడివుంటాయని వారు ఎంతగానో సంతోషపడిపోయారు. కానీ పాపం ఒక్కో గేలానికి ఒక్కోటి తగిలింది. చేప మాత్రం ఒక్కరి గేలానికే వుంది. అది ఎవరిదనేది కనుక్కోవాల్సింది మీరే.

రెండు చదరాలే మిగలాలంటే....



చిన్నారులూ.... పక్కన అగ్గిపుల్లలతో చేసిన చదరాలు వున్నాయి చూశారుగా. ఇందులో సరిగ్గా ఎనిమిది అగ్గిపుల్లలను కదిలించి రెండు చదరాలు మాత్రమే వుండేట్టు చూడాలి. రెండూ ఒకదానికొకటి తాకకూడదు. మరి ప్రయత్నించండి. జవాబు పైవారం.

ఎన్ని పదాలు రాయగలరు!

హేయ్! ఇవాళ మీ ముందుకు ఒక బుజ్జి పెట్టె వచ్చింది. అందులో ముచ్చటగా తొమ్మిది అక్షరాలున్నాయి. మీరీపాటికి కనిపెట్టేవుంటారులే. అసలు విషయం ఏంటంటే... వీటితో మీరు 36 పదాలు రాయాలి. ప్రతి పదంలోనూ T తప్పని సరిగా వుండాలి. నామవాచకాలు, బహువచనాలు రాయకూడదు. మరి రెడీనా. జవాబు పైవారం.

S	C	E
I	T	S
T	N	I



గతవారపు

ఎవరబ్బా! జవాబు

అది పుస్తకపురుగు
దాన్ని ఆంగ్లంలో
BOOK WORM
అంటారు. తెలిసిందా!

ఏ మార్గంలో వెళ్లాలి?

నేస్తాలూ... పైన కొండలు, దారులు, చెట్లు, దూరంగా ఒక ఇల్లు కనిపిస్తోందికదూ. ఆ ఇల్లు పింకీ అనే పిల్లాడిది. కింద వరుసగా వున్న బుడ్డోళ్లు పింకీ ఫ్రెండ్స్. వారి దగ్గర పింకీ వాళ్ల ఇంటికి చేరే రూట్ మేప్ వుంది. వాటిలో ఏ మేప్‌ను అనుసరించి వెళితే పింకీ వాళ్ల ఇంటికి చేరుకుంటాం? ప్రయత్నించండి.

ఏడ్చే పిల్లాడికి రంగులేద్దాం

పైన ఓ బుడ్డోడు ఏడుస్తున్నాడుకదా. ఎందుకో అర్థమైందా? ఆ... వాడు అగ్గిపుల్లలతో ఆటలు మొదలెట్టాడు. చెయ్యి కాలింది. దాంతో ఏడుపు లంకించుకున్నాడు. అందుకే 'నిప్పుతో ఆటలు వద్దు' అంటారు పెద్దలు. పాపం వాడి ఏడుపు ఆపాలంటే... ఒక్కటే మార్గం వుంది. అదేంటంటే... వాడి బొమ్మకు రంగులు వేస్తే సరి.

25.9.05 కు సరైన సమాధానం రాసినవారు

ఎ.ఉమామహేశ్వరరావు (6), జడ్‌పిహెచ్‌ఎస్, దేవుపల్లి. జి.సాయిభరత్‌రెడ్డి (7), మోదుకూరు, గుంటూరు. డి. భరత్‌నాయక్ (8), ఎం.వి.సత్యనారాయణ (8), జవహర్ నవోదయ విద్యాలయం, వేలేరు. సిహెచ్. అర్జున్‌రావు (9), పల్లెర్లమూడి. సిహెచ్.రవికాంత్ (9), నర్సన్నపాలెం. డి. భాస్కర్ నాయక్ (9), శ్రీ వాణి విద్యాలయం, జనగాం. మారోజు సతీష్ చారి (10), డి. హరివీరనాయక్ (10), మారోజు కిరణ్మయి (చిన్న 9), తాళ్లపల్లి సురేందర్ గౌడ్ (బన్ని 10), శ్రీ వాణి విద్యాలయం, జనగాం. ఇరుమల్ల రవికుమార్ (8), బొంతగట్టు నాగారం. దుస్సా అక్షయ్‌కుమార్ (5), జనగామ. రావుల దిలీప్ (8), నారాయణగిరి. ఎం.నారాయణ రాజు (6), జి.మాడుగుల. ఆర్.అనిల్‌కుమార్ (10), మహబూబ్‌నగర్. ఎం.డి.రాజ్‌మహ్మద్ (5), వీవర్స్ నగర్ , వరంగల్. జి.సాయిభరత్‌రెడ్డి (7), మోదుకూరు. పి.శివకుమార్, ఎ.ఇందు, పి.రాజు, డి.రేణుక, ఎ.అనిల్, బి.రాజు, ఎన్ . సాయిలీల, నేషన్ హైస్కూల్, నాగర్‌కర్నూల్. వి.ఆంజనేయులు (8), వి.నర్సింహ (8), వి.రాము (7), బి.విష్ణు (7), వి.నర్సింహనాయుడు (7), నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్. ఎస్.సరిత, పల్లవి (8), శ్రీ శారద విద్యామందిర్, వనపర్తి. పి.హరీష్, మహేష్ (8), గోకినపల్లి. ఎం.మధుకర్ యాదవ్, డి.సాయికృష్ణ యాదవ్, కె.మహేష్ యాదవ్, పి.సాయికిరణ్, టి.శ్రీనివాస్, ఆర్. నాగన్న, పి.చిన్న కె.వీరయ్య, డి.భావన, కె.బేబీ, అన్నారం. కె.వంశీ కృష్ణ (10), జడ్‌పిఎస్‌ఎస్, బీరోలు. ఎ.సాహిత్యలోహిత (4), ఎ.శరత్‌చంద్ర (2), పాలకొల్లు. వి.శ్వేత (7), బాలాజీ నగర్, నెల్లూరు. బి.బాల భార్గవి, విజయనగరం. ఎం. నారాయణరాజు (6), మాదుగుల, విశాఖ. డి.దిలీప్ (9), జన్నారం. వి.సుమంత్ (6), నెహ్రూ హై స్కూల్, అద్దంకి. ముంద్రు మనోహర్ (7), వేల్పూరు. ఆసోదు చౌదరి (6), జడ్‌పిహెచ్‌ఎస్, కూనపరాజుపర్వ. కె.శ్రీతన్మయ (3), గుంటూరు. వై.దినేష్‌బాబు (5), ప్రగతి బాలవిద్యాలయం, సుందరయ్యనగర్, తాడేపల్లి. జి.బస్వరాజ్ (10), జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ధన్వాడ. పి.భీమేష్ (9), సర్వ, మహబూబ్‌నగర్. యస్.మౌనీష్ (5), చైతన్య హైస్కూల్, తిరుపతి. ధనరేకుల అశోక్ (6), శ్రీ వాణి విద్యాలయం, జనగాం. ఎస్.సౌమ్య సుధ (6), వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, బాలాజీనగర్, నెల్లూరు. వి.బ్రహ్మం (8), బుద్ధారం, ఖమ్మం. పి.అన్నాచారి (8), జడ్‌పిఎస్‌ఎస్, బుద్ధారం. కె.రాజీవ్‌గాంధీ (10), జి.పరశురాం (10), వేములపల్లి, నర్సింహుల పేట, వరంగల్. రాళ్లబండి సాయికిరణ్ (4), విశ్వశాంతి హైస్కూల్, శ్రీరాంపూర్. ఎ.అనిల్ (7), శ్రీ చక్రధర పబ్లిక్ స్కూల్, సోంపేట, శ్రీకాకుళం.

(బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి).

2.10.05 సమాధానం:
శాంతి కపోతం

వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో తెలుసా! ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గొప్ప చిత్రకారుడు. ఈయన పేరులో మూడంటే మూడే అక్షరాలుంటాయి. ఈ నెలలోనే ఆయన జయంతి వుంది. గుర్తొచ్చారా? ఐతే వెంటనే రాసి పంపండే. మా చిరునామా: వీరి వీరి గుమ్మడి పండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

జంఝూవతి కి రబ్బర్ డ్యామ్

ఎస్ విశ్వేశ్వరరావు

విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని జంఝూవతి నదిమీద నిర్మించబోతున్న రబ్బర్ డ్యామ్ మన దేశంలోనే, ఆసియా ఖండంలోనే మొట్టమొదటిది. అనకట్టలు, వంతెనలు సహజంగా రాతి కట్టడాలుగా, సిమెంట్ కాంక్రీట్ పోసే విధానం వచ్చాక వాటి మధ్యలో ఇనుము, ఉక్కు ఉపయోగించడం విన్నాం. అలాకాకుండా రబ్బరును ఉపయోగించి ఆనకట్ట తయారుచేసి నీటిని నిలువచేయడమనేది ఇందులో ప్రత్యేకత.

ఓ నదిపై రబ్బరు డ్యాం కడితే ఎలా ఉంటుంది? ఊహించడానికే కష్టసాధ్యమైన ఈ విషయం సుసాధ్యం కాబోతోంది. అదీ మన రాష్ట్రంలోనే. ఆసియా ఖండంలోనే ఇది మొట్టమొదటి ప్రాజెక్టు. విజయనగరంజిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామం సమీపంలో జంఝూవతి నదిపై అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రబ్బరు డ్యాంను నిర్మిస్తున్నారు. జంఝూవతి నదిపై ఒకస్థాయి దాటిన తరువాత శాశ్వితంగా నిలిచిపోయే ప్రాజెక్టులేవీ కట్టకూడదని పొరుగున ఉన్న ఒరిస్సా రాష్ట్రం అనటంతో ఇటువంటి ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాల్సి వచ్చింది. దీనివల్ల జంఝూవతి ప్రాజెక్టు కింద ఉన్న సాగుకు అధికంగా నీటిని అందించవచ్చు. అలాగే ఒరిస్సాతో ఉన్న వివాదమూ పరిష్కారమైపోతుంది. వరదలొచ్చినపుడు పరివాహక ప్రాంతాలకూ ముంపు ప్రమాదం ఉండదు. ఇటువంటి బహుళ లక్ష్యాలుగల ప్రాజెక్టు ప్రస్తుతం అత్యంత వేగంగా నిర్మాణం జరుపుకుంటోంది.

రబ్బరు డ్యాం అంటే...

గాలిబుడగ లాంటి నిర్మాణం సాయంతో నదిలో తాత్కాలిక జలాశయం ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేయడానికి ఈ రబ్బరుడ్యాం కడతారు. ఇలాంటివాటిని అరుదైన నిర్మాణాలుగా చెప్పుకోవచ్చు. ప్రపంచంలో పలు దేశాలలో ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో వీటి నిర్మాణం 1950 దశకం నుంచి ప్రారంభమయ్యింది. కాని మన దేశంలో వీటి వినియోగం ఇప్పటి వరకూ లేనే లేదు. కేరళలో గతంలో నిర్మించినప్పటికీ అది చిన్నది కావటంతోబాటు కేవలం తాగేనీటి అవసరాలకు నిర్మించటంతో దానికి అంతగా ప్రాధాన్యత లభించలేదు. సాగునీటి అవసరాల కోసం మనదేశంలో తొలిసారిగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఈ రబ్బర్‌డ్యాం ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వీటి వినియోగం చెప్పుకోతగ్గస్థాయిలో ఉన్నప్పటికీ ఆసియా దేశాలలో మాత్రం తక్కువగానే ఉన్నాయి. తాత్కాలిక అవసరాల కోసం, నీటిని రెండు మూడు దశాబ్దాలపాటు నిల్వ చేయాల్సినప్పుడు రబ్బర్ డ్యాంల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ వ్యయం కావటంతోబాటు త్వరితగతిన పూర్తి చేయాల్సి వచ్చినప్పుడు, రెండు మూడు దశాబ్దాలకు మించి అవసరం లేదనుకునప్పుడు మాత్రమే రబ్బర్ డ్యాం నిర్మాణం చేపడుతుంటారు.

ఆ విధంగా ఝుంజావతి జలాశయం పథకం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. విజయనగరం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామం వద్ద అంతరాష్ట్రనది ఝుంజావతిపై ప్రస్తుతం రబ్బర్ డ్యాం ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని ఐదు మండలాల్లోని 75 గ్రామాలు లబ్ధిపొందే విధంగా రూపొందించిన ఝుంజావతి జలాశయ పథకానికి సరిహద్దున ఉన్న ఒరిస్సా రాష్ట్రం నుంచి ముంపు సమస్య దృష్ట్యా అనుమతి లభించకపోవటంతో పూర్తిస్థాయిలో శాశ్వత నిర్మాణం కాకుండా రబ్బర్ డ్యాం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ఆ రాష్ట్రంలో ముంపు సమస్య తలెత్తకుండా నీటిని జలాశయంలో నిల్వ చేయవచ్చు. ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాల మధ్య జంఝూవతి నీటి పంపకం ఒప్పందం గతంలోనే కుదిరింది. నాలుగు శతకోటి ఘనపుటడుగుల (4 టి ఎం సి అడుగులు) నీటిని అంటే నదిలో లభించే





నీటిలో 50 శాతం వాటా ఆంధ్రప్రదేశ్ వాడుకునేందుకు అంగీకరించిన ఆ రాష్ట్రం నదినీటి ప్రవాహ ప్రాంతంలో నిర్మాణం మాత్రం ముంపు సమస్య పరిష్కారం అయ్యేవరకూ చేపట్టరాదని పట్టుబట్టింది. అందుకు అంగీకరించిన ఆంధ్రప్రదేశ్ విధిలేని పరిస్థితిల్లో రబ్బర్ డ్యాం చేపట్టింది. ఓ వైపు నదిలో నీరు వృధాగా సముద్రం పాలవుతోంది. మరోవైపు ఆయకట్టుకు నీరు అందక భూములు బీడులు పడుతున్నాయి. ఈ పరిస్థితిల్లో ఒరిస్సా నుంచి ఎప్పటికి అనుమతి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ రాష్ట్రంతో సమస్య పరిష్కరించుకునే వరకు నిర్మాణానికి అనుమతించేది లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసింది. దాంతో మధ్యేమార్గంగా రబ్బర్ డ్యాంను ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆదేశాల ప్రకారం అధికారులు చేపట్టారు. నీరు వృధాకాకుండా ఆయకట్టు సాగులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే దీనిని ఏర్పాటు చేస్తున్నారు.

ఒరిస్సాలో ముంపు సమస్య తలెత్తకూడదనే రబ్బర్ డ్యాం

దీనివల్ల జలాశయం నుంచి నీటిని వినియోగించుకోని ఆయకట్టు అభివృద్ధి చేయటంతో బాటు ఒరిస్సా నుంచి ఎటువంటి సమస్య తాత్కాలికంగా ఎదురుకాకుండా చూసుకోవచ్చు. మధ్య తరహా పథకం కింద చేపట్టిన జంఝావతి పథకాన్ని 1976లో అంటే దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ. 15.51 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అంతరాష్ట్ర సమస్యల వల్ల జాప్యం కావటంతో అంచనా వ్యయం ప్రస్తుతానికి రూ. 124 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఆగస్టు నాటికి రూ. 66.63 కోట్లు వ్యయం అయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం పనులకు బడ్జెట్‌లో రూ. 12 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 6.5 కోట్ల వ్యయంతో రబ్బర్‌డ్యాం ఏర్పాటు చేస్తున్నారు.

మన రాష్ట్రంలో 4 గ్రామాలు, ఒరిస్సాలో మూడు గ్రామాలు ముంపునకు గురవుతాయి. మన రాష్ట్రంలో 1070 ఎకరాలు, ఒరిస్సాలో 1175.10 ఎకరాలు ముంపునకు గురవుతాయి. మన రాష్ట్రంలో భూసేకరణ ఇప్పటికే పూర్తయ్యింది. 2002 డిసెంబర్ 23న భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో గ్రామసభలు నిర్వహించటానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అందుకు సంబంధించిన సమాచారాన్ని ఆ తర్వాత మన అధికారులు పంపించలేకపోయారు. 2005 జూన్‌లో ఆ సమాచారాన్ని మన ప్రభుత్వం పంపించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒరిస్సా మంత్రి వర్గ ప్రతినిధి బృందం వచ్చినప్పుడు భూసేకరణకు సహకరించాలని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, భారీ నీటి పారుదల శాఖమంత్రి పొన్నాల లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు.

ఆ రాష్ట్రం అంగీకరించేలోగా, ముంపుపై అభ్యంతరం వ్యక్తం కాకూడదంటే, ఆ రాష్ట్రంలో భూములు ముంపునకు గురికాకూడదంటే జంఝావతి జలాశయంలో ప్రస్తుతం 125.50 మీటర్ల ఎత్తుకు మించి నీటిని నిల్వ చేయకూడదు. జలాశయంలో ఆ ఎత్తు ఒరిస్సాలో సరిహద్దు ఎత్తుకు సమానం (ఇంటర్ స్టేట్ బోర్డర్ లెవెల్ 125. 50 మీటర్లు) అంతకు ఎత్తు మించితే అక్కడి భూములు ముంపునకు గురవుతాయి. మన రాష్ట్రంలోనే ఈ ప్రాజెక్టుకి భూసేకరణ ఇంత సమస్యగా ఉంది. మరి ఇతర రాష్ట్రాలలో భూ సేకరణ సమస్య మరింత జటిలంగానే ఉంటుంది. నాన్ ఓవర్ ఫ్లో బ్లాకులను కనీసం 125.50 మీటర్లకు నిర్మిస్తేనే జలాశయంలో కొంతైనా నీటిని నిల్వచేయటం వీలవుతుంది. అందుకోసం 122.50 మీటర్ల వరకూ నిర్మాణపనులు పూర్తిచేసి ఆపైన మూడు మీటర్లమేర రబ్బర్‌డ్యాం ఏర్పాటు చేస్తున్నారు.



జలాశయంలో 60 మీటర్ల పొడవునా 3.2 మీటర్ల ఎత్తుతో దీనిని ఏర్పాటు పనులు పూర్తికావస్తున్నాయి. ఒక్కొక్కటి 30 మీటర్లు చొప్పున దీనిని రెండు సెక్షన్‌లు ఏర్పాటు చేపట్టగా ఎడమవైపు (డ్యాం బ్లాక్ నెంబర్ 10) ఇప్పటికే పూర్తయింది. కుడివైపున (డ్యాం బ్లాక్ నెంబర్ 11) ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ పనిని గత నెల 16న ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు స్థలంలో పరిశీలించి సమీక్షించారు. ఆస్ట్రియాకు



చెందిన హైడ్రో కన్‌స్ట్రక్ట్ (రబ్బర్ డ్యాం కంపెనీ)కి రాష్ట్ర ప్రభుత్వం ఈ పనిని అప్పగించింది. ఆ కంపెనీకి చెందినవారే ప్రస్తుతం రబ్బర్ మెటీరియల్‌ను తీసుకువచ్చి బిగిస్తున్నారు. ఆస్ట్రేలియా, ఆస్ట్రియా దేశాలలో ఈ తరహా డ్యాంల నిర్మాణాలకు పలు కంపెనీలు ఉన్నాయి. సాంకేతిక వివరాలు అంటే సైజులు మాత్రం మన ఇంజనీరింగ్ అధికారులు తెలియజేస్తే ఆ కంపెనీల అధికారులు అందుకు తగిన విధంగా మెటీరియల్ తయారు చేసుకువచ్చి బిగించి ఒప్పందం పేర్కొన్న ప్రకారం నిర్వహించి అమలులో అప్పగించి వెళతారు.

రబ్బర్ డ్యాంవల్ల ఉపయోగాలు

తక్కువ వ్యయంతో పూర్తి అవుతుంది. కాంక్రీట్ నిర్మాణంతో పోలిస్తే మరీ తక్కువ. ప్రధానంగా శాశ్వతంగా కాకుండా తాత్కాలికంగా ఉపయోగించుకోవాలనుకున్నప్పుడు రబ్బర్ డ్యాం తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చు. వంద మీటర్ల వరకూ ఎటువంటి అండ (సపోర్టు) లేకుండా దీనిని ఏర్పాటు చేయవచ్చు. దీనిని అమర్చటం కూడా తక్కువ వ్యయంతో కూడుకున్నదే. అందుకు సమయం కూడా తక్కువే పడుతుంది. దీనిని బిగించటానికి పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం అవసరం ఉండనవసరంలేదు. ప్రాజెక్టుపై అంటే రబ్బర్ డ్యాం ఏర్పాటు చేసే కింది భాగంలో కాంక్రీటు నిర్మాణానికి ఎంబెడెడ్ మెటల్స్ ముందుగానే బిగిస్తారు. వాటికి రబ్బర్ డ్యాంను బిగిస్తారు. నిర్వహణలో కూడా పెద్దగా సమస్యలు ఉండవు. గాలి, నీటి సరఫరా బ్లోయర్లు-పంపులు మాత్రమే ఉంటాయి. వాటిని పని చేయించేందుకు విద్యుత్ మాత్రమే అవసరమవుతుంది. గాలి, వేడి, నీటి ప్రవాహం తాకిడి, రసాయినాలు, ఉప్పు నీరు, ఇసుక తదితర ప్రభావాలకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా రబ్బర్ లేయర్లు, ఫ్యాబ్రిక్‌తో మెటీరియల్ ఉంటుంది. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా అంటే వరదలు, తుఫానుల తాకిడిని ఎదుర్కొనే పద్ధతిలో మెటీరియల్ ఉంటుంది. పైకి మన వాహనాల టైరులోని ట్యూబ్‌లాగానే కనిపించే రబ్బర్‌లోన భాగంలో పటిష్టమైన ఫైబర్ ఉంటుంది. జలాశయం, ప్రవాహసామర్థ్యాన్నిబట్టి రబ్బర్, ఫైబర్ ఉంటుంది. సాధారణంగా 8 నుంచి 20 మిల్లీమీటర్ల మందంతో రబ్బర్ ఉంటుంది. ఫైబర్ లేయర్లు మాత్రం రెండు నుంచి నాలుగు వరకూ అవసరాన్ని బట్టి ఏర్పాటు చేస్తారు. జలాశయంలో కాంక్రీట్, బేసనరీ నిర్మాణాలు నీటిని నిల్వ చేసిన విధంగానే రబ్బర్ డ్యాం జలాశయంలో నీరు నిల్వ ఉండే విధంగా అడ్డుకుంటుంది. పై నుంచి నీరు యథావిధిగా ప్రవహిస్తుంటుంది. దీనిపై మనిషి సులభంగా నడిచివెళ్ళవచ్చు. నీటి ప్రవాహం పెరిగినప్పుడు గేట్లను తెరిచి నీటిని విడుదల చేసినట్లుగానే రబ్బర్ డ్యాంను నీటి విడుదల లేదా ప్రవాహం అదుపు చేసేందుకు ఉపయోగించవచ్చు. నిర్మాణం పూర్తయిన జలాశయాలు ఎత్తు పెంచటం సాధ్యంకాని పరిస్థితుల్లో నీటి నిల్వ పెంచటానికి లేదా వరద నీటిని నియంత్రించటానికి వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. నదుల్లోకి సముద్రంలోని ఉప్పునీరు కలుషితం కాకుండా అడ్డుకునేందుకు బిగిస్తున్నారు. పర్యావరణ సమస్యలు తలెత్తకుండా జలాశయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ విధంగా అమలు చేస్తున్నారు.



నిర్వహణ సులభమే

రబ్బర్ డ్యాంను జలాశయం కాంక్రీటు నిర్మాణంపై భాగంలో ఏర్పాటు చేశాక గాలిని నింపితే అది పనిచేస్తుంది. గాలిని తీసివేస్తే దానంతట అదే రబ్బర్ (బ్యాగ్) బట్టలా కింద పరుచుకుంటుంది. నీటిని నిల్వ చేయాలనుకున్నప్పుడు గాలిని రబ్బర్ డ్యాంలోకి పంపిస్తారు. నీటిని నిల్వ చేయకుండా కిందకు విడుదల చేయాలనుకుంటే గాలిని తీసివేస్తే అడ్డం తొలగిపోతుంది. ఇందుకోసం కంట్రోల్ విభాగం, ఎలక్ట్రికల్ ఆటోమేటిక్ డిఫ్లేషన్ పని చేస్తుంటాయి. కంట్రోల్ వ్యవస్థ ద్వారా గాలి లేదా నీటిని రబ్బర్ డ్యాంలోనికి పంపిస్తారు. నదిలో నీటి ప్రవాహసామర్థ్యాన్ని బట్టి దీనిని మార్పులు చేర్పులు చేసుకునే విధానం అమలులో ఉంటుంది. ఇందుకోసం నది ఎగువభాగం పరిస్థితికి సంబంధించి సెన్సార్‌లు ఉంటాయి. కింది భాగం నుంచి గాలిని పంపించేందుకు ఏర్పాట్లు కంట్రోల్ వ్యవస్థ నుంచి అమర్చి ఉంటాయి. నీరు లేదా గాలికి ఫిల్టర్, ఎగ్జాస్ట్ వాల్వ్, లెవల్ సెన్సార్ ఒకే ప్రాంతంలో కంట్రోల్ వ్యవస్థతో అనుసంధానంగా ఉంటాయి. ఇవన్నీ కూడా వాటంతట అవే యాంత్రికంగా అవసరాన్ని బట్టి పనిచేసే విధంగా రబ్బర్ డ్యాంలో భాగంగానే ఏర్పాటవుతాయి.

జంఝావతి జలాశయం

కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో 24,600 ఎకరాలు సాగులోకి వస్తుంది. మాగాణి 6161.20 ఎకరాల్లోనూ, ఆరుతడి 18,478 ఎకరాల్లోనూ పండించవచ్చు. 3.40 శతకోటి ఘనపుటడుగుల నీటిని జలాశయంలో నిల్వచేస్తారు. మొత్తం 58.25 కి.మీ మేర కాలువలు తవ్వుతున్నారు. ఈ సీజన్‌లో పాక్షికంగా 9 వేల ఎకరాలకు నీరు అందిస్తున్నారు.

ఏమైతేనేం... ఆసియాలోకే మొట్టమొదటిసారిగా నిర్మితమౌతున్న ఈ రబ్బరు డ్యాం విలక్షణీయమైనది కావచ్చు. మేధాపట్కర్ లాంటి మేధావులు భారీ ప్రాజెక్టులు పర్యావరణానికి ప్రమాదకరమంటున్నారు. వాటి బదులు చిన్నచిన్న చెక్‌డ్యాంలు కట్టవచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ రబ్బరు డ్యాం కూడా ఒకానొక పరిష్కారంగా కనబడుతోంది. జంఝావతి రబ్బరు డ్యామ్ మరిన్ని చిన్నప్రాజెక్టులకు ప్రేరణ కాగలిగితే మంచిదే. ✠





ఆరోగ్యం

- డాక్టర్ నాగినేని భాస్కరరావు,
హైదరాబాద్

విటమిన్ - బి1 చాలా అవసరం

నీటిలో కరిగే విటమిన్ - బి కాంప్లెక్స్‌కు సంబంధించిన విటమిన్‌లు అన్నీ జీవకణాల జీవక్రియలో అతి ముఖ్యమైన అనేక ఎంజైము వ్యవస్థలలో పాత్ర వహిస్తాయి. ఈ గ్రూపులోని విటమిన్లు థయమిన్ (విటమిన్ బి1), రైబోఫ్లావిన్ (బి2), నియాసిన్ (బి3), కాల్షియం పాంటోథినేటు (బి5), సయనేకో బాలమిన్ (బి12), ఓరోటిన్ యాసిడ్, పాంగామిక్ యాసిడ్, లేట్రైల్ (బి 17). బయోటిన్ (హెచ్), ఖోలిన్ (బి 14), ఇనోసిటాల్, పారాఎమైనోబెంజాయిక్ యాసిడ్ ఇవన్నీ రసాయనికంగా తేడాలతో ఉన్నప్పటికీ ఈస్టు, కాలేయం మొదలగు ఆహార పదార్థాలలో కలిసి ఉంటాయి. ముందుగా థయమిన్ గురించి తెలుసుకుందాం.

థయమిన్ (బి1)

థయమిన్ నీటిలో కరిగే విటమిన్ బి1. న్యూట్రల్ లేక క్షార మీడియంలో వండినట్లయితే థయమిన్ నాశనమవుతుంది. డుయెడినమ్ మొదటి భాగంలో థయమిన్ ముఖ్యంగా శోషించబడుతుంది. శరీరంలో థయమిన్ నిల్వలు (సుమారు 50 మి.గ్రా.) తక్కువ స్థాయిలో ఉంటాయి. థయమిన్ యొక్క ముఖ్యమైన ధర్మాలను నిర్వహించే రూపం థయమిన్ పైరోఫాస్ఫేట్. ఇది ముఖ్యమైన ఎంజైము వ్యవస్థలో సహ ఎంజైముగా పని చేస్తుంది.

ఇది రోజువారీ మగవారిలో 1.4 మి.గ్రా., ఆడవారికి 1 మి.గ్రా., (గర్భిణీ స్త్రీలకు 0.4 మి.గ్రా., పాలిచ్చే తల్లులకు 0.5 మి.గ్రా. అదనంగా ఇవ్వాలి) కావాలి. శిశువులకు 0.3 నుంచి 0.5 మి.గ్రా., పది సంవత్సరాలలోపు పిల్లలకు 0.7 నుంచి 1 మి.గ్రా. కావాలి. రక్తహీనత, జ్వరం వచ్చినప్పుడు థయమిన్ అదనంగా కావాలి.



థయమిన్ లేనట్లయితే పిండి పదార్థాల జీవక్రియలో మాధ్యమిక ఉత్పత్తులైన లాక్టిక్ యాసిడ్, పైరువిక్ యాసిడ్‌లు శరీరంలో నిల్వ పేరుకుంటాయి. న్యూరోట్రాన్స్‌మిటర్స్ అయిన ఎసిటైల్ ఖోలిన్, సెరిటోనిన్‌ల పనితీరును థయామిన్ ప్రభావితం చేస్తుంది. బియ్యాన్ని తెల్లగా పాలిష్ పడితే థయమిన్‌ను నష్టపోతాము. వడ్లను ఉడకబెట్టి చల్లార్చిన తరువాత మరపడితే వచ్చే ఉప్పుడు బియ్యంలో థయమిన్ ఉంటుంది. అలాగే బియ్యానికి ఎక్కువగా ఎసరు పెట్టి గంజి తీసివేస్తే ఆ అన్నంలో థయమిన్ ఉండదు.

థయమిన్‌ను తక్కువగా తీసుకోవడం వల్ల, సరిగ్గా శోషింపబడకపోవడం వల్ల, అలాగే ఎక్కువ అవసరం ఉన్నా (ఉదా: గర్భిణీస్త్రీలు, పాలిచ్చే తల్లులు), విరేచనాలు అవుతున్నా, థయమిన్‌కు వ్యతిరేకంగా పనిచేసే టీ, ఇతర పదార్థాల వల్ల థయమిన్ లోపం వస్తుంది. దీనివల్ల బెరిబెరి, రికెట్స్ వ్యాధులు సంభవిస్తాయి. బెరిబెరిలో నరాలు తిమ్మిరి, రిఫ్లెక్సెస్ మారడం, కండరాలు నిండుగా ఉన్నట్లు ఉండటం, గట్టిగా ఉండటం, నీరసం, నొప్పులు ఉంటాయి. కండరాల ప్రకంపనాలు ఉంటాయి. దీనిలో డ్రై బెరెబెరి, వెట్ బెరిబెరి అనే రెండు రకాలు ఉన్నప్పటికీ సాధారణంగా రెండు రకాలు కలిసే రోగుల్లో సంభవిస్తాయి. డ్రై బెరిబెరిలో అనేక రకాల నరాలు బలహీనంగా ఉంటాయి. కండరాలు క్షీణిస్తాయి. తేమ బెరిబెరిలో గుండెదడ, నాడి నీరసంగా ఉండటం, గుండె కుడి భాగం పరిమాణం పెరగడం, సిస్టోలిక్ రక్తపోటు ఎక్కువగానూ, డయాస్టోలిక్ రక్తపోటు తక్కువగానూ ఉంటాయి.

ఈ థయామిన్ పాలిష్ పట్టని బియ్యంలోనూ, దంపుడు బియ్యంలోనూ, ఎండు చిక్కుడు గింజలు, సోయాబీన్స్, వేరుశనగ, గుడ్డు పచ్చసోనలోనూ థయమిన్ బాగా ఉంటుంది.

కథ

దానం శివప్రసాద రావు

అయ్యా.... మా కార్డు

"అయ్యా! నా ఇంటి నెంబరు ఇది! నన్నీ రోజు ఫోటో దిగేందుకు రమ్మన్నారు. కుటుంబసమేతంగా వచ్చాను. ఏదో నెంబరు ఇస్తార్ట! ఎక్కడ?" గదిలో హడావిడిగా తిరుగుతున్న ఓ అధికారినడిగాను.

నన్నో అమాయకపు జీవిని చూసినట్లుగా చూసి "అటెళ్లండయ్యా!" అన్నాడు.

జనం బాబోయ్ జనం! జనం!! కిటికీల దగ్గరా జనమే!

సందుచేసుకుని కిటికీలోంచి తొంగి చూశాను. వరుసగా కంప్యూటర్లు! ముందువైపు గుమ్మంవద్ద ఓ బల్ల మీద ఆఫీసర్లు కుస్తీపడుతున్నారు. తాలూకాఫీసు అటెండర్లు జనాన్ని నియంత్రిస్తున్నారు. మెట్ల కింద, చెట్ల కింద పసిపిల్లల తల్లులు. కొత్త రేషను కార్డు కోసం అప్లై చేసుకుంటే... ఫలానా రోజున మున్సిపల్ ఆఫీసుకొచ్చి ఫోటో దిగండని చెప్పారు. అందుకే సెలవుపెట్టి మరీ వచ్చా. ముందుగా మనమిచ్చిన 'ఫాం'లోని వివరాలను కంప్యూటరులో నిక్షిప్తం చేసి ఓ నెంబరిస్తారట. దాన్ని తీసుకెళ్లి ఫోటో దిగాలిట. దాంట్లో కుటుంబసభ్యులంతా అంటే... పిల్లా జెల్లా ముసలీ ముతకా అందరూ ఉండి తీరాలి. ఇదీ కథ.



ఏ అధికారి నెంబరిస్తారో? అసలు ఎవరినడిగి సమాచారం తెలుసుకోవాలో అర్థం కావడం లేదు!

బైట రకరకాల కామెంట్లు.

"చూడండి మాష్టారూ! నేను నాల్రోజులబట్టి తిరుగుతున్నా! ఒక్క కౌంటర్ పెట్టారు! ఇందాకనే ఆ మెట్ల మీదనే నిలబడి వార్డు పేర్లు చదివాడో అబ్బాయ్! అందులో మీ పేరుచూస్కోండి" అన్నాడు నా పక్కనున్న వ్యక్తి.

"ఎక్కడ? ఆ అబ్బాయ్"

"ఇకిప్పుడుకాదు... రేపు రండి!" సలహా ఇచ్చాడు సదరు వ్యక్తి.

మా ఆవిడ గొణగడం ప్రారంభించింది.

"సాయంత్రం ఆరైంది! ఇకపద!" అన్నాను.

పట్టువదలకుండా మరుసటి రోజుదయంసదరుస్థలానికి పదిగంటలకొచ్చాను. అప్పుడుకూడా జనప్రవాహం! జనం!జనం!

"తిరగలేక ఛస్తున్నాం"

"రేపటితో చివరి రోజట! అయ్యను తీస్కురా పో"

"సార్! నా పేరు తప్పుపడింది"

"సార్ నా పోటోలకు ముందు ఐ స్కానింగ్ తీయాలట! ముందు అదిగానీ ఇవ్వాలనా?"

"వారం రోజులైంది! ఇంకెన్నాళ్లని తిరగం?"

"ఇదిగో కార్డు లేకుంటే లేకపోయింది! పద ఇంటికి!"

ఇదుగో అటేపు గోడ దగ్గర 15వ వార్డు! అహ కాదు కాదు. అన్ని వార్డుల పేర్లు చదువుతున్నారట పదండి!

"అక్కడ నాపేరొచ్చింది" ఓ అభ్యర్థి

'అదృష్టవంతుడివోయ్' లాటరీ తగిలిన వాణ్ని అభినందించినట్లుగా అభినందన.

"ఏమదృష్టం! నా పిండాకూడు!

"నెంబరు తీస్కోవడానికి నా ఫారం నాకిచ్చి అందుగో ఆ కిటికీ దగ్గరకెళ్లమన్నారు"

మరింకేం వెళ్లు"

"అక్కడ చూడు! కొత్త సినిమా రిలీజయినరోజు టిక్కెట్లుకోసం పోరాటంలా! అటుచూడు!"

"మరెలా అలా అంటే?"

మూడోరోజు కూడా ఇదే ప్రవాహం.

"అయ్యా నా ఇంటినెంబరిది! ఇంకేదో నెంబరిస్తార్ట! ఎక్కడ?"

"నిన్ననే ఇచ్చేశాం. అయినా పిల్చినప్పుడుండకుండా ఎక్కడికెళ్తారయ్యా మీరు? మాకు మాత్రం నాల్గు చేతులున్నాయా?"

ఏమీ పాలుపోలేదు నాకు. "నన్నేం చేయమంటారు?"

"సాయంత్రం ఓ మారు రండి! ఇప్పుడు ఫోటోల కార్యక్రమం జరుగుతోంది"

"నన్ను విసిగించకండి!" జనంలో కలిసిపోయాడు సదరు అధికారి.

"ఇంకా రెండు మూడు కౌంటర్లు పెట్టుకుంటే ఏం పోయిందట?"

"వారం రోజులబట్టి తిరిగి తిరిగి విసుగుపుడుతోంది!"

"ఎలక్షన్లండి! ఎలక్షన్లు!"

"కావాలనుకుంటే తిరగాలిమరి!"

"మనమంటే తిరుగుతామండీ! పెద్దోళ్లనూ, పిల్లలనూ ఎన్నాళ్లని తిప్పుతాం"

"అవునుమరి! మున్సిపల్ ఎన్నికలు కదూ"

సాయంత్రమైంది. జనవాహిని చూర్లు పట్టుకుని వేలాడుతోంది. ఎవరిగోలవాడిది! నెంబరొచ్చిందని! ఇకఫోటో దిగడమే తరవాయి! అని కొందరంటుంటే ఈ ఫోటోలో తప్పులొచ్చాయనీ పేర్లు తప్పు పడ్డాయని మరికొందరు నాలాంటి వాళ్ల సంగతి మామూలే! ఇక రోజూ నా ప్రైవేటుద్యోగ విధినిర్వహణకు నేను పోతూ... సెలవులు దండుగ కాకుండా సాయంకాలాలూ మాత్రమే వచ్చి విచారిద్దామని అనుకుంటుండగా...రయ్‌మంటూ జీపొచ్చాగింది.

పెద్దాయన కాబోలు... కానిస్టేబుళ్లు బిలబిలమంటూ దిగారు.

ఆయన కోసం అప్పటికప్పుడు వేదిక. ఎర్ర తివాచీ, సింహాసనంలాంటి కుర్చీ, దాని పక్కన మిగితా వంధిమాగధులకోసం మామూలు కుర్చీలు... ముఖ్యంగా ఫొటోగ్రాఫర్లు, మీడియా కెమేరామెన్‌లు రెడీ చేశారు. ఆయన మాట్లాడే సొల్లు పట్టడానికన్నంత దగ్గరగా మీడియావారి చేతిమైకులు. ఆ మైకుల్లో అందరికీ వినబడలేదుగానీ..."ఓటరు మహామహానుభావుల్లారా...మీ కోసమే ఈ కార్డుల గడువు ఇప్పటిదాకా పెంచి అందరికీ...మీ అందరికీ కార్డులిప్పిస్తున్నాననేని సెపుతున్నానన్నమాట. మరి మీ ఓటు మాత్రం నాకేనన్నది...." షరా మామూలు ప్రసంగం తరువాత... అక్కడక్కడే కార్డు అంతకుముందే ఇచ్చిన ఓ పదిమందిని తీసుకొచ్చి వారి కార్డులు లాక్కుని మళ్లీ వాటినే ఆ పెద్దాయన చేతుల మీదుగా పొంది కెమేరా ద్వారా సర్వ టీవీ పెట్టెలందు కూడా కనబడి ధన్యులౌతున్నారు.

నేను మాత్రం....నా నెంబరెక్కడో వెతుకుతూనే....

ఉదయశంకర్

కప్పల బాగోతం

ఏదో గోలగా వినబడి భేతాళం అండ్ విక్రమార్కేశ్వరరావులు చిరాగ్గా నిద్ర లేచారు. ఆ గోలేదో దూరంగా చేసుకోక వచ్చివచ్చి మన మర్రిచెట్టు కిందే చేయాలా అనుకుంటూ భేతాళుడు చెట్టుమీంచి కిందకు చూశాడు. చెప్పరాని విచిత్రం కనబడి "ఏమీ ఈ వ్యాపారలీల" అనుకున్నాడు. చెట్టుకింద ఓ వ్యక్తి త్రాచులో కప్పల్ని తూస్తున్నాడు. మరికొంతమంది బేరాలు ఆడుతున్నట్లుగా ఉంది. కానీ ఆ బేరం ఆడేవాళ్లు తాము తీసుకుందామనుకున్న కప్పలు ఒక తక్కెడలో నిలకడగా ఉండటంలేదు. ఈవతలి తక్కెడలోని కప్ప ఆవతలి తక్కెడలోకి, ఆవతలి తక్కెడలోని కప్ప ఈవతలి తక్కెడలోకి తెగ గెంతేస్తున్నాయి. కొన్ని కప్పలు పసుపుపచ్చగా ఉంటే, మరికొన్ని గులాబీ రంగులో, ఎక్కువ కప్పలు మూడురంగుల్లో ఉన్నాయి. భేతాళుడుకి చెప్పరానంత ఆశ్చర్యం. కప్పలేంటి అలా రంగురంగుల్లో ఉండటవేంటి, వాటినలా తక్కెట్లో తూయడవేంటి, అవలా ఇందులోంచి అందులోకి దూకడాలేంటి ఏవీ అర్థం కావట్లేదు. రాత్రి పొద్దుపోయి చూసిన ఇంగ్లీషు సినిమాలాగా ఏం అర్థం కాలేదు. "ఏంటి గురువా ఈ కప్పల పురాణం?" అనడిగాడు. విక్రమార్కుడికి ముందు అర్థంకాలేదు కానీ...ఇటీవలి మున్సిపల్ పరోక్ష ఎన్నికలు, ఛైర్మెన్, మేయర్ ఎన్నిక రాష్ట్రవ్యాపిత క్యాంపురాజకీయాలు, కిడ్నాపు బేరసారాలు, అధిష్టానాల మంతనాలు అన్ని గుర్తుకురాగానే తమకు ఈ వారం చేతినిండా పనిదొరికిందనుకున్నాడు. "భేతాళుడా మిస్టర్ బి తాళ్‌గా తయారవ్వు. మున్సిపల్ రాజకీయులను ఇంటర్వ్యూ చేయాలి" అంటూ తను రాసుకునే ప్యాడ్ ఎక్కడుందో వెతుక్కుని సిద్ధమయ్యాడు. ఇద్దరూ అలా బయలుదేరారో లేదో...వెదకపోయిన తీగ ఎదురయినట్లు... కేశవరావుజీ గాంధీభవన్‌లో సెల్‌ఫోన్‌తో తిప్పలు పడుతూ కనబడ్డారు. చెవిలో ఫోన్ కదా...అటూఇటూ పచార్లు చేస్తూ... చేతులూ ఊపుతూ... ఏకపాత్రాభినయం చేస్తున్నతీరులో ఉన్నారు.



వి మార్క్ : సార్...ఈ మున్సిపల్ ఎలెక్షన్‌లు ఇరవయ్యో శతాబ్దంలో జరిగినా వందేళ్ల క్రితం సామెతే మీమీద పడుతోంది. ఎందుకంటారు?

కె.కె. : కప్పల తక్కెడ సామెత గురించేనా మీరు అనబోతున్నది. సామెతలకే మా శరీరాలు గాయపడిపోతే... మేమే కాదు...మా దాయాదులు, మా ప్రతిపక్షులు ఎవ్వరూ ఒక్క సెకనుకూడా ఈ రాజకీయ రంగంలో ఉండలేరు. నెవ్వర్. ఇట్స్ క్వయిట్ ఇంపాజిబుల్ ఐ సే. ఇంక చెప్పండి. ఆవతల చాలా పనుంది. మా కప్పల్ని మేం...సారీ...మా వాళ్లను మేం కాచుకోవాల్సిన పని తీరికలేకుండా ఉంది. హలో...తెనాలి...

వి మార్క్ : సార్ మీరు అనేకచోట్ల రికార్డు స్థాయిలో గెలిచారు కదా. మరి ఛైర్‌పర్సన్ ఎంపిక విషయంలో ఎందుకింత గుంపుచింపులవుతున్నారో చెబుతారా?

కె.కె. : గెలవడానికేం...గెలిచాం. కానీ ఏదో ఎవరికీ పూర్తిగా గెలుపు దక్కకుండా హంగ్ ఏర్పడ్డ త్రిశంకుస్వర్గ స్థానాలు కొన్ని ఉన్నాయిలేండి. అవి మా మటుకు మాకూ...అదేవిధంగా అభ్యర్థులకూ "భలే ఛాన్సులే...లలలాంలలలాం...లక్కీ ఛాన్సులే" అన్న సీను కదా! దానితో వాళ్లు మాతో కూడా "చిక్కడూ-దొరకడు పాలసీ" అమలు చేస్తున్నారు. దాంతో మా తిప్పలు మావిలాగా ఉన్నాయి.

వి మార్క్ : మీ పార్టీవారు వేరే పార్టీవారితో జత కడితే బాధ వ్యక్తంచేస్తున్నారు కదా...మరి మీరు మరో పార్టీవారిని మీదాంట్లోకి లాక్కుంటే అదే బాధ కదా?

కె. కె. : మీరు, మీ మీడియా పొరబడుతున్నారు. ఇతర పార్టీల గెలుపు గుర్రాలు మా అఖండమెజారిటీకి ఆకర్షితులై వస్తున్నారు. అలా వచ్చేవారిని కాదంటామా చెప్పండి.

వి మార్క్ : మరి మీ అఖండ్ మెజారిటీ వచ్చిన గుంటూరు, తెనాలిలో జరిగినదాని గురించి ఏమంటారు?

కె. కె. : అదేమరి...మా ప్రతిపక్షనేత చంద్రబాబుగారు ఇలాంటి జిమ్మిక్కులు వేసి మా వాళ్లను ప్రలోభపరచడం ఎంతో శోచనీయం అని తీవ్రంగా ఖండిస్తున్నాను. (గాంధీభవన్‌లో ఉన్న టీవీలోకొచ్చిన చంద్రబాబుని చూసి మరింత రెచ్చిపోయినవాడై) యస్. తీవ్రంగా ఖండిస్తున్నాను.

చంద్రబాబు హడావుడి కూడా చూసి గాంధీభవన్ నుంచి నేరుగా చంద్రబాబు దగ్గర ప్రత్యక్షమయ్యారు బివీటీవీ ప్రతినిథులు.

వి మార్క్ : కాంగ్రెస్ నేత ఖండనకు మీ ప్రతిస్పందనేంటి సార్?

చంద్రబాబు : ఖండనలకేముంది. మేమూ ముందే ఖండించాం కదా...ప్రత్యక్ష ఎన్నిక కాకుండా...పరోక్ష ఎన్నిక అన్నరోజునే ఖండించేశాం. అయినా రాజకీయాలలో పాటించాల్సిన విలువలు పాటించకపోతే ఈ దేశం ఏమౌతుంది చెప్పండి?

బి తాళ్ : (కెమేరా వెనుకున్న తలను పక్కకుతీసి) ఏ దేశం సార్...భారతదేశమా...తెలుగుదేశమా సార్? మరి మీ పార్టీకూడా ఎరలు తగిలించిన గాలాలతో మెదక్ ఆదిలాబాద్ జిల్లా భైంసా మునిసిపాలిటీ మురుక్కాలవల పక్కన నిలబడ్డారు కదా!

చం.బా. : దానికి మేము బాధ్యులమెలా అవుతాం చెప్పండి. మీరు మరీనూ...భైంసాలో మేం ఏ పాపమూ ఎరగం. తెరాసాలోంచి తె.తె.దే.గా కొందరు నిజాయితీపరులు బయటకొచ్చారు. తెలంగాణా తెలుగుదేశం అని వచ్చినవారితో మేం మా అధికారబలం మేం చూసుకున్నాం. ఇందులో తప్పేంటో మాకర్థం కావట్లేదు.

వి మార్క్ : మరి మీకు తెరాసాకు సిద్ధాంతపరంగానే వ్యతిరేకం కదా మరి ఈ విధంగా వ్యవహరించడం ఏ విలువలకు చెందినదంటారు?

చం.బా. : చూడు బ్రదర్. రాజకీయాల్లో శాశ్వత శతృవులు, శాశ్వత మిత్రులంటూ ఉండరు. అదేమరి రాజకీయం అంటే అని మనవి చేసుకుంటున్నాను.

మరింకెక్కడో కప్పల అరుపులు, బేరసారాలు వినబడ్డవైపుకి కెమేరాతో బివీటీవీ మళ్లింది.

తెంగ్లీష్

డా॥జె.పి.వైద్య

"సిమెంటు ఇటుకలతో కలిసి రాయిలాగా గట్టిగా దృఢంగా తయారవుతుంది. అదే సిమెంటు మట్టితో చేతులు కలిపితే-మట్టి పాలవడం కన్నా సాధించేదేమీ ఉండదు. మనం మనుష్యులం...పిరికివాళ్లలా ప్రతి దానికి భయపడి, గజగజ వణికి పోతూ, దూరంగా పారిపోవడం ప్రారంభిస్తే ఏదీ సాధించలేము. ధైర్యగుణంతో ముందుకు సాగే సాహసమూర్తులకు 'నిజం' ఓ చక్కటి ఆయుధంలా 'శిక్తిని' ఆపాదిస్తుంది. అదే 'నిజం' పిరికివాళ్ల చేతుల్లో పడి అన్యాయంగా మూగపోతుంది...అర్థమైందా?"

అని తెలుగుసారు ఒక్క దమ్ములో చెప్పి, ఆగి, గుండె నిండా గాలి పీల్చుకున్నారు.

-"హమ్మయ్య! సారు జఽరంత సేపు ఆగిందు... మల్లా ఏం షురు చేస్తడో...?" అని విన్న శ్రోతల్లో చాలా మంది బుర్ర గోక్కున్నారు. ఎలెక్షన్లు అయిపోయినయి గద...! వీధుల్లో ప్రతి రోజూ సాగే 'గోల' బంద్ అయిపోయింది.

రంగు రంగుల తోరణాలూ...రంగురంగుల ఝండాలు....

గోల గోల 'లొల్లి'...'ధన్‌ధనాధన్ ధన్నక్'...మోతా...

అన్నీ మాయమైపోయి- వీధులన్నీ బోసిగా జఽరంత 'లైఫ్‌లెస్' కన్పించసాగాయి.



ఏ పనీ పాటా లేని 'ఫుక్కట్ గాళ్లు'-'వాట్ నెక్స్ట్' అన్నట్టు దిగులుగా 'ఇక ఏం చేద్దాం'? అన్నట్టు గాజు కళ్లు 'ఫ్యూచర్' వైపు సారించి చూడడం ప్రారంభించారు. మా తెలుగు సారుకు ఈ గాజుకళ్ల గుంపు 'రెడీమేడ్ శ్రోతలుగా' దొరికేవరకు ఆయన 'ఖుషీ'కి అంతులేకుండా పోయింది.

అందుకే ఇంటి ముందు 'అరుగు' ముందు 'భాషణీ' నిరాటంకంగా కొనసాగిపోతోంది.

మున్సిపాలిటీ వాళ్లు చెత్త తీసుకుపోవడానికి ట్రాక్టర్లతోనూ, తోపుడు బండ్లతో వచ్చి వెళ్లారు... ఇంట్లోని 'చెత్తంతా' బండ్లలో గమ్యం వైపు వెళ్లిపోయింది- కాని-ట్రాక్టర్ల నుంచి చెత్త మళ్లీ రోడ్డుమీద చిద్విలాసంగా నవ్వుతూ ఒళ్లు విరుచుకుంది.

మార్నింగ్ వాక్‌కు అటుకేసి నడిచి వస్తున్న ఒక 'తెల్ల టీషర్ట్' గారు అది చూసి చలించి పోయి, తెలుగుసార్‌నూ-అరుగుమీద బలవంతంగా అంటుకుపోయిన గుంపునూ చూసి వీరావేశంతో అందుకున్నారు...

-'యేస్! ఎ హెల్దీ మైండ్ క్రియేట్స్ ఎ హెల్దీ అట్మాస్ఫియర్...!

గుడ్ సరౌండింగ్స్...గుడ్ ఫీలింగ్...

గుడ్ ఫీలింగ్స్...గుడ్ ఐడియాస్...

గుడ్ ఐడియాస్...గుడ్ లివింగ్...

గుడ్...'

'అతి' ...'గుడ్' సాగేవరకు తెలుగుసారు వారు ఎలా ఊరుకుంటారూ?

"అవునవును...తెలుగులోనూ- సంస్కృతంలోనూ ఉన్నాయి. లెండి చక్కటి సుభాషితాలు...! అయినా మనసులోంచి మంచి భావాలు ఉబికి రావాలి...ఉబికి వస్తే భావ శక్తి...భావశక్తిలోంచి రచనా శక్తి...రచనాశక్తి లోంచి కవితాసక్తి... ఆసక్తి అంటూ ఉండాలి కాని సాహిత్యంలోంచి ఎన్ని 'మణులనూ, మాణిక్యాలనూ, ముత్యాలనూ, ఏరుకోలేం...

తెల్లటి టీషర్ట్ ఖంగుతిన్నట్టు చూసి -'నో!నో! ఐయామ్‌నాట్ టాకింగ్ అబౌట్ మణులూ, ముత్యాలూ...' అనిఏదో అనబోయారు.

తెలుగుసారు తెలివిగా అడ్డుకుని-'నేనూ మణులూ, ముత్యాలూ అమ్మడం లేదు లెండి... సుభాషితాలూ మణులూ, ముత్యాలకన్నా అందంగా ఉంటాయి..ఏ సాహిత్యమైనా, ఏ భాష అయినా, భావం ముఖ్యం కదా...తెలుగూ, సంస్కృతం 'రాజకీవి' కల్గిన సుభాషితాలకు ఖుంఖాను ఖుంఖాలుగా అందించాయి...

"గాఢాంధకాభిదురో॥ పిచదీప్తి జాలై
ద్దీప స్తమో న నిజమూలగతం నిహంతి!
ప్రాయ:పదార్థ పరిసాధన కాము కానాం
స్వార్థే మనాగపి న సజ్జతి చిత్తవృత్తి"

చిన్న 'చిరుదీపం' ప్రకాశకాంతులతో నల్లటి చిక్కటి చీకట్లను పారద్రోలుతుంది. కాని, తన అడుగున ఉన్న చీకటిని తొలగించలేదు. పరోపకారం చేసే పొద్దోళ్లకు 'స్వార్థం' ఉండదు..

వాళ్లే నిజమైన పరోపకారులు...అర్థమైందా?

టీషర్ట్ గారు ఒక్కక్షణం బుర్ర గోక్కొని-మళ్లీ విజృంభించారు...

-"ఇఫ్ వన్ డజ్‌నాట్ లవ్ వర్క్..వన్ ఈజ్ ఆల్వేస్ అన్ హ్యాపీ అన్‌లైఫ్...ఇన్ ఆర్డర్ టు బి ట్రూలీ హ్యాపీ ఇన్‌లైఫ్-వన్ మస్ట్ లవ్ వర్క్" అని చెప్పారు...

-'అవున్లెండి...పని చెయ్యాలి..సోషల్ వర్క్ చెయా‌ఁయలి...'

-'య్యా...య్యా...వన్ షుడ్‌వర్క్...అండ్ బి ఎగుడ్ సోషల్ వర్కర్' అని వాళ్లిద్దరూ నవ్వుతూ వెనక్కి చూసే వరకు అరుగు 'ఖాళీ'గా కన్పించింది...

'వర్క్'...'పని'...'సోషల్ వర్క్'...అనే సుభాషితాలు విన్న యువకుల గుంపు ఎప్పుడో జారుకున్నది.

ఖాళీ అరుగు వెక్కిరించినట్టు కన్పించేసరికితెలుగు సారూ, తెల్లటి టీషర్ట్ గారే 'సోషల్ వర్క్' ప్రారంభించారు...! ⌘



హేమలత

నాటి రేవు పట్టణం...నేడు కుగ్రామం

అదో సముద్రతీర ప్రాంతం...

వచ్చే పోయే ఓడలతో...వర్తకులతో... వ్యాపారస్తులతో... రత్నాల ఎగుమతులతో... ఆ ప్రాంతమెప్పుడూ కిటకిట లాగుతుండేది.

ఇదే ప్రకాశం జిల్లాలోని మోటుపల్లి గ్రామం... ఒక నాటి రేవుపట్టణం. ఇది కేవలం ఓడరేవే కాదు ప్రాచీన కళావైభవానికి, అధ్యాత్మిక సంపదకు ప్రతీక.

దీని ఆనవాళ్లైనా చూడాలని మీకనిపిస్తోందా? కానీ ఈ అలనాటి చరిత్ర ఆనవాళ్లు మీకు నేడు మచ్చుకైనా కనబడవని చెప్పడం కన్నా... ఈ గ్రామచరిత్ర నామరూపాల్లేకుండా పోయిందంటే సరిపోతుందేమో...అదెలా?

తెలుసుకోవాలంటే చిత్రగుప్తుని సామంతుడైన సింవర్మ ఈ సామ్రాజ్యాన్ని పాలిస్తున్న రోజుల్లోకి వెళ్లాల్సిందే....

అదో అందమైన సముద్రతీర ప్రాంతం... ఇక్కడ ఇసుకతిన్నెలు... సముద్రపు అలలతోపాటు ఓడలనూ చూడొచ్చు. అవును. ఇదో పెద్ద ఓడరేవు! అంటే... సరుకులు ఎగుమతి, దిగుమతి చేసుకోవడమేనా? ఇది నిజమే కానీ అప్పట్లో సరుకులంటే రత్నాలు, విలువైన వస్త్రాలు! ఆశ్చర్యంగా ఉంది కదూ. అంతేకాదు ప్రతివారమూ ఈ ఓడరేవు నుంచి ఎగుమతయ్యే వస్త్రాల విలువ కోటి వరహాలుండేదని ప్రజలు చెప్పుకుంటారు.

'ఈ ప్రాంత వైభవాన్ని కళ్లారా చూస్తే ఎంత బాగుంటుంది' అని మీకనిపిస్తోంది కదూ? అచ్చంగా ఇలాగే రుద్రమదేవికీ అనిపించిందిట! దాంతో ఆవిడ స్వయంగా మోటుపల్లికి వచ్చారనీ, దీనికి చిహ్నంగా ఓ శాసనాన్ని చెక్కించారనీ మార్కోపోలో రాశారు. మెకంజీకుడా అనే చారిత్రకారుడు 19వ శతాబ్ధంలో మోటుపల్లిని సందర్శించారట. హిస్టాలిన్ అనే గ్రీకు నావికుడు తన రచనల్లో మోదిలియా పట్టణ వైభవాన్ని చాలా గొప్పగా వర్ణించారనీ... ఇది మోటుపల్లి గ్రామమేననీ చారిత్రకారుల విశ్వాసం.

అది 1971... ఏప్రిల్ 10

మొదటి సారిగా వీరభద్ర స్వామి ఆలయం దోపిడీకి గురైంది. దొంగలు నిరాశగా వెనుదిరిగారు. రెండోసారి పకడ్బందీగా వ్యూహం పన్నారు. అది...జూన్ 22. గ్రామస్థులందరూ ఏమరుపాటుగా ఉన్న సమయం చూసి దొంగలు దేవాలయంలోకి ప్రవేశించారు. మూలవిరాట్టులను తొలగించారు. పీఠం అడుగున తవ్వనారంభించారు. కొద్ది సేపటికి... వారి ప్రయత్నం ఫలించింది. అమూల్యమైన రత్నాలు, వజ్రవైడూర్యాలు బయటపడ్డాయి.

ఈ వీరభద్రస్వామి విగ్రహాన్ని మీరు నేటికీ హైదరాబాదు సాలార్జంగు మ్యూజియంలో చూడొచ్చు. ఇంకా ఈ ప్రాంతంలో మోటుపల్లిలో బయటపడిన నాణాలు, విగ్రహాలు పురావస్తుశాఖ అధీనంలో ఉన్నాయి. వీరభద్రస్వామి ఆలయానికి ఆరు కిలోమీటర్ల దూరంలో కోదండ స్వామి ఆలయముండేదట! దీనిని అగస్త్య మహర్షి ప్రతిష్టించారనీ, కాకతీయుల కాలంలోనే ఈ ఆలయంలో దొంగలు పడ్డారనీ ప్రజలు చెప్పుకుంటారు. ఇలా కాలక్రమంగా దోపిడీలకు గురైన ఈ గ్రామ చరిత్ర కనుమరుగైపోయింది. దీని వైభవం కాలగర్భంలో కలిసిపోయింది. నేడు ఈ సముద్రతీరాన్ని చూస్తే రత్నాల రాశులు కాదుకదా కనీసం ఇక్కడో ఓడరేవు ఉండేదన్న ఆనవాళ్లూ కనబడవు. ఒకనాడు ఎగుమతుల క్షేత్రంగా విలసిల్లిన మోటుపల్లి చారిత్రక సాక్ష్యంగా మిగిలింది. ప్రస్తుతమీ గ్రామం ఓ కుగ్రామాన్ని తలపిస్తోందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు.



దూర తీరాలు

కన్న దేశం వదిలి, ఉన్న దేశానికి వస్తే
ఉన్న వాళ్లంతా కానివాళ్లే !

కారు వున్నా, కాసు వున్నా,
ఊరు గాని ఊరులోన సుఖం సున్న !

కారు ఏసి ఇల్లు ఏసి
వళ్లు మాత్రం వేడి వేడి

ఊరు గొప్పది, పేరు గొప్పది
ఉనికి మాత్రం ఉత్తది !

సంవత్సరాలుగా సహచరులే
సంబంధాలు మాత్రం అరకొరలే !

ముఖం చూడ సుపరిచితమే
మనిషి మాత్రం అపరిచితుడే !

ఎదురుపడితేనే హాయి, బాయి,
ఎప్పుడు కలవాలి చేయి చేయి !

ఎప్పుడు కావాలి భాయి భాయి !!

ఇక్కడి ఇళ్లే బందిఖానాలు,
మూసిన వాకిళ్లు, మనసుకు సంకెళ్లు !

భార్యా భర్తలు కూడా,
దూరపు బంధువులే !

ఎవరి లెక్కవారికి,
ఎవరి తిక్క వారిది !

నవ్వు కృత్రిమం, నడత కృత్రిమం !
అంతా అసహజత్వం, అంతా యాంత్రికం !!

రోజంతా కంప్యూటర్‌తోనే కబుర్లు,
"నువ్వు యంత్రానివే" అన్నట్లు దాని విసుర్లు !

స్వచ్ఛమైన గాలి పీల్చి ఎన్నాళ్ళయింది,
సూర్యోదయాన్ని చూసి ఎన్నేళ్లయింది ?!

ఆత్మీయంగా మాట్లాడేవాళ్ల కోసం
ఆత్రంగా చూడడం.

తెరిచిన వాకిళ్ల కోసం
అలుపెరగక వెదకడం

అలవాటయిన ఈ కళ్ళు
ఆలోచిస్తాయి రేయింబవళ్లు!

ఎంతగా కలిసిపోదామన్నా,
పరాయివాడినన్న భావన !

చుట్టూ వందలమంది వున్నా
ఎవరూ లేని ఒంటరితనం !!

నా దేశాన్ని నాకు దూరం చేసిన
నా రూపాయి అవిటితనం !!!



ఎస్. వెంకట్రావు

సైబర్ స్పేస్‌లో సయ్యాట

సైబర్ ప్రపంచంలో జరిగే వింతలను మనం రోజూ పత్రికల్లో చదువుతున్నాం. సైబర్ స్నేహాలు, సైబర్ ప్రేమలు, సైబర్ వివాహాలు, సైబర్ నేరాలు, సైబర్ షాపింగ్‌లు.... ఇలా సైబర్ ప్రపంచం వాస్తవ ప్రపంచానికి ప్రతిరూపంగా మారిపోతోంది. సైబర్ రూపాలు, రంగులు సరే సైబర్ వాసనలు కూడా వాస్తవం చేస్తూ ఇటీవల కొన్ని గమ్మత్తులు వచ్చాయి. వెబ్ సైట్ తెరవగానే అందులో ఏ వస్తువునైతే మనం చూస్తామో ఆ వస్తువుతో బాటు దానికి సంబంధించిన వాసనలు కూడా వెదజల్లే ఏర్పాటు చేస్తున్నారట. దాంతో వస్తువుతో బాటు వాసన కూడా మన అనుభవంలోకి వస్తుంది. అంటే సైబర్ ప్రపంచం వాస్తవానికి మరింత దగ్గరగా వస్తుందన్న మాట. అయితే ఇంతటితో ఆగకుండా వీటన్నిటినీ మించిన వాస్తవంలోకి మనల్ని ఇంటర్ నెట్ ద్వారా తీసుకుపోయే సాంకేతిక పరిజ్ఞానం మరోవైపు అభివృద్ధి చెందుతోంది. అయితే ఇది సైబర్ స్పేస్‌లో జరుగుతున్న పరిణామం కాదు. మన మెదళ్ళలో, మన మెదడు కణాల్లో ఈ పరిణామాలు జరగబోతున్నాయి.

శాస్త్రవేత్తలు ఇప్పుడు వెంట్రుక మొనలో లక్షో వంతు పరిణామం గల అది చిన్న ఎలక్ట్రానిక్ చిప్స్ తయారు చేస్తున్నారు. ఇటువంటి సూక్ష్మ చిప్స్‌తో అత్యంత సూక్ష్మమైన కంప్యూటర్ రోబోట్లు తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ అతి సూక్ష్మ పరికరాల విజ్ఞానం ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీన్నే "నానో టెక్నాలజీ" అంటున్నారు. 2020 సంవత్సరం నాటికి అతి సూక్ష్మమైన రోబోట్ల తయారీ పెద్ద ఎత్తున జరుగుతుందని అంచనా. ఈ సూక్ష్మ రోబోట్లను "నానోబోట్లు" అంటున్నారు. మరో పదిహేను-ఇరవై ఏళ్లలో ఇవి అనేక అద్భుతాలు సాధించే పనిలో ఉంటాయి. మన శరీరంలోని రక్తకణాల కన్నా అతిసూక్ష్మంగా ఉండే ఈ "నానో బోట్ల"ను రక్తం ద్వారా శరీరంలోని ఏ భాగానికైనా పంపి ఎటువంటి క్లిష్టమైన పనులైనా చేయవచ్చు. అప్పుడు వైద్య శాస్త్రంలో అద్భుతాలే జరుగుతాయి. "నానోబోట్లు" మెదడు, ఇతర నాడీ కణాల్లోకి, ఆ కణాలను కలిపే భాగాల్లోకి, ఒక నాడీ కణం నుండి మరో నాడీ కణానికి సమాచారం అందించే జంక్షన్‌ల లోకి చొచ్చుకుపోయి కీలకమైన స్థానాలను ఆక్రమించగలవు. ఇవి అత్యంత సూక్ష్మమైన, అణువు మందంలో ఉండే ఎలక్ట్రానిక్ భాగాలు కనుక ఒక మాత్ర లేక కాప్స్యూల్ పరిమాణంలో కొన్ని కోట్ల నానోబోట్లు ఉంటాయి. అంటే మనం ఒక 'నానోకాప్స్యూల్' వేసుకుంటే ముందుగానే ప్రోగ్రామింగ్ చేయబడిన కొన్ని కోట్ల నానోబోట్లు శరీరంలో ఏ ప్రాంతానికైతే ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ తమకు నిర్దేశించిన పనిని నిర్వర్తిస్థాయి. ఈ నానోబోట్ల మధ్య హైస్పీడ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా ఉంటుంది. అందువల్ల ఇవి ఒకదానితో ఒకటి నిత్యం సమాచారం అందించుకోగలవు, వాటిని కంట్రోల్ చేసే మరో కంప్యూటర్ లేదా కంప్యూటర్లతో (ఇవి శరీరం లోపల ఉండొచ్చు, బయట ఉండొచ్చు) కూడా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోగలవు. ఉదాహరణకు: ఇప్పుడు మనం మెదడులోనో లేక నాడీ మండలంలోని మరే భాగంలోనో సమస్యను పరిశీలించడానికి స్కానింగ్ తీస్తున్నాం. సిటి స్కాన్ అత్యంత విస్తృతంగా ఉపయోగిస్తున్నాం. ఇటువంటి స్కానర్ల టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మెదడు లోనికి పోయి దాన్ని పూర్తి స్వరూపాన్ని మరింత లోతుగా విశ్లేషించడం సాధ్యమవుతోంది. అయితే 2030 నాటికి ఈ పనిని స్కానర్ల స్థానంలో "నానోబోట్లు" చేస్తాయంటున్నారు శాస్త్రనిపుణులు. కొన్ని కోట్ల 'నానోబోట్లు' మెదడులోకి ప్రవేశించి వాటి వాటి స్థానాల్లో ఉండి అక్కడి నాడీ కణవ్యవస్థ సమాచారాన్ని అతి సమీపం నుండి సేకరించి అన్ని 'నానోబోట్లు' ఒకేసారి సమాచారం



పంపుతాయి. ఈ సమాచారం మొత్తాన్ని మరో కంప్యూటర్ విశ్లేషించి మెదడు యొక్క అత్యంత సన్నిహిత చిత్రాన్ని ఇస్తుంది. ఈ నానోబోట్లను గనుక మరికొంత మార్పుచేసి ఉపయోగిం చుకుంటే మరో అద్భుతం జరుగుతుంది. మన శరీరంలోని నాడీ కణాలు జ్ఞానేంద్రియాలనుండి సమాచారాన్ని సేకరించి మెదడుకు పంపిస్తాయి. జ్ఞానేంద్రియాలనుండి ఈ సమాచారం నాడీకణాలకు బదిలీ అయ్యే చోట్లను "ఇంటర్



న్యూరోనల్ కన్నెక్షన్స్' అంటారు. అంటే సమాచారం నాడీ కణాలకు అక్కడినుండి మెదడుకు చేరే జంక్షన్లన్న మాట. ఇటువంటి జంక్షన్లలో "నానోబోట్లు" కూర్చుని వాస్తవంగా ఇంద్రియాలనుండి అందే సమాచారాన్ని తొక్కిపట్టి దానికి బదులు తమ స్వంత సమాచారాన్ని అందిస్తే అప్పుడు వాస్తవ సమాచారం బదులు నానోబోట్లు అందించే సమాచారాన్ని మన మెదడు ప్రోసెస్ చేస్తుంది. అంటే వాస్తవంగా ఉన్న స్థితిని కాకుండా నానోబోట్లు అందించే మిథ్యా సమాచారంతో "మిథ్యాస్థితిని" సృష్టిస్తుందన్న మాట. దీన్నే "వర్చ్యువల్ రియాలిటీ" అంటున్నారు. ఇప్పుడు తన నాడీ కణాల్లో ముందుగానే ప్రోగ్రామింగ్ చేయబడిన నానోబోట్లను నింపుకున్న వ్యక్తి ఇంటర్ నెట్ ద్వారా సైబర్ స్పేస్‌లోకి వెళ్లాడనుకోండి ఇప్పుడు అతనికి సైబర్ ప్రపంచంలో కనిపించే ప్రతి స్థితీ తను ఉన్న స్థితిలాగే కనిపిస్తుంది. అంటే సైబర్ స్పేస్‌లో అతను "వర్చ్యువల్ రియాలిటీ" (వాస్తవం కాని మిథ్యా వాస్తవం)లో విహరిస్తుంటాడన్న మాట. మీరు సైబర్ స్పేస్‌లో ఫ్రెండ్‌ను కలిసారనుకోండి ఇప్పుడు చాట్ చేసుకోవడం, లేక నెట్ ఫోన్‌లో మాట్లాడుకోవడంతో సరిపెట్టాల్సిన పనిలేదు, మీ సైబర్ ప్రపంచంలో మీరు ముంబాయి మెరీన్ డ్రైవ్‌నుగాని, ఢిల్లీలోని మొఘల్ గార్డెన్స్‌నుగాని లేక ఎక్కడో స్విట్జర్లాండ్‌లోని అందమైన ప్రదేశాన్ని గాని ఓపెన్ చేసుకుని అక్కడ ఆ ప్రదేశంలో మీ ఫ్రెండ్‌తో కలిసి విహరించే అనుభూతిని పొందవచ్చు. అతనితో మాట్లాడవచ్చు, అతన్ని పట్టుకోవచ్చు, వాసనలు గ్రహించవచ్చు. మన నాడీ జంక్షన్‌లలోని నానోబోట్లు వాస్తవ జ్ఞానాన్ని కాకుండా నెట్‌లో మనం సృష్టించే పరిస్థితికి అనుగుణమైన మిథ్యా జ్ఞానాన్ని మనకు అందిస్తాయి. దాంతో మనం వర్చ్యువల్ రియాలిటీలో నిజంగానే లేనిది ఉన్న అనుభూతి పొందుతాం. ఆ రకంగా బంధువులతో కావలసినప్పుడు కలుసుకోవచ్చు. వ్యాపార విషయాలు మాట్లాడుకోవచ్చు, రొమాన్స్ చేసుకోవచ్చు ఒకటేమిటి వాస్తవ జీవితంలో నీవు అనుభించేవన్నీ వర్చ్యువల్ రియాలిటీలో 'అనుభవించొచ్చు'. ఇప్పటికే ఉన్న వర్చ్యువల్ రియాలిటీ మొరటైనది. కాని ఆ నాడు నానోబోట్ల సాయంతో నీవు సృష్టించే వర్చువల్ రియాలిటీ నిజమైన అనుభూతిని ఇస్తుంది.

తమాషాగా ఉంది కదూ! కాని ఈ తమాషా వాస్తవ రూపం దాల్చే దిశగా టెక్నాలజీ శరవేగంగా పరుగెడుతోంది.

కొత్త పుస్తకాలు

కనుమరుగవుతున్న కళారూపాలు

ఒకప్పటి గ్రామీణ సమాజంలో రకరకాల ఆటుపోటులు, ఆశ్రితజాతుల కళాప్రదర్శనలు, భాగోతాలు వినోదసాధనాలుగా ప్రజలనాకర్షించాయి, అలరించాయి. ఈ కళాప్రదర్శనలు, వినోదప్రదర్శనలు సినిమాదెబ్బతో కకావికలమైపోయాయి. కేబుల్ టీవీతో వీటి ఆనవాళ్లే కరువయ్యాయి. అక్కడక్కడ నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నా... అవి సినిమారంగ ప్రచారానికే పరిమితమౌతున్నాయి. ఇలాంటి సందర్భంలో నాటకాలు, వాటి ప్రదర్శన, వాటి కోసం తపించిపోయిన కొంతమంది కళాకారుల ఆరాటాన్ని, ప్రతిభను, అంకితభావాన్ని తన జ్ఞాపకాల నుండి వాళ్ల ఊరి భాగోతం కథలను రచయిత అందజేస్తున్నారు.

తాతగారిలాగే కొండయ్య మామకూ నాటకాలపిచ్చి. అది కాస్తా మేనల్లుడికి సోకింది. ఇంట్లో చెప్పకుండా ఇద్దరూ కలసి నాటకాలు చూడడం వృథాప్రయాసనీ, మనమే ఒక నాటక కంపెనీ తెరుద్దామనీ కొండయ్య నిర్ణయిస్తారు. బాలాగౌడ తర్ఫీదులో నెలరోజులు రిహార్సిల్స్ చేసి 'రుక్మాంగద' నాటకాన్ని, 'జంగం పంతులు శిష్యులు', "గయోపాఖ్యానం" నాటకాలను విజయవంతంగా ప్రదర్శిస్తారు. బాల నాయకునిగా వెలుగులోకొస్తారు. ప్రదర్శనలో సహజత్వం కోసం యమధర్మరాజుకు దున్నపోతును తేవడంతో హరిశ్చంద్ర నాటకంలో రసాభాసవుతుంది. ఆరుబయట ప్రదర్శనలు కాబట్టి వర్షమొచ్చినా, అగ్ని ప్రమాదాలు సంభవించినా అంతా గగ్గోలే. పొద్దంతా కూలీ పనులకు, వ్యవసాయ పనులకు పోవడంతోనూ, రాత్రిళ్లు రిహార్సిల్సుకు రావడంతోనూ గడిచిపోతుంది. నాటకంపై ప్రేమతో ఎన్ని ఇబ్బందులు పడ్డా అనుకోని ఖర్చులు కొండయ్య మీద పడతాయి. డబ్బుకోసం నాటకాలాడాల్సి రావడం, వేషగాళ్లలో మునుపటి ఉత్సాహం, ఐక్యత లోపించడంతో నాటక సమాజాన్ని మూసివేయాలనే నిశ్చయానికొస్తాడు కొండయ్య. నాటకం నేర్చుకోవడం మొదలు, ప్రదర్శనలో ఎదురైన రకరకాల అనుభవాలను వినోదాత్మకంగా దీనిలో తీర్చిదిద్దిన తీరు ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇందులో కోతిమూతి ఎల్లయ్యతో ప్రహసనం, అల్లీరాణి వేషం వేసే మైసయ్య బుడెనకానలవి ఒక్కో ప్రహసనం హాస్యరీతిలో సహజంగా చిత్రించిన తీరు ప్రశంసనీయం.

"మా ఊరి బాగోతం"
(కథలు' పెద్దింటి అశోక్ కుమార్)
ప్రచురణలు సిరిసిల్ల,
వెల 60/- పేజీలు 120
ప్రతులకు అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలలో లభించును.

కె.పి. అశోక్ కుమార్

నా స్మృతిలో చేగువేరా

చేగువేరా ఒక్కసారిగా అదృశ్యమైనప్పుడు దానిపై రకరకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. తొలి దశలో అతని క్షేమం దృష్ట్యా క్యూబా మౌనం పాటించింది. చివరకు 1967లో అతను హత్యగావించబడ్డాడని నిర్ధారించుకున్న తరువాతనే కాస్ట్రో అందుకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయటపెట్టాడు. వాటిలోనే ఆయన చే వ్యక్తిత్వ విశిష్టతకు నివాళులర్పించారు. అదే సమయంలో గెరిల్లా యుద్ధంలో చే అనుసరించిన పద్ధతుల్లో కొన్ని లోపాలను చూపడానికి కూడా కాస్ట్రో సంకోచించలేదు. వాటిని, తరువాత వివిధ దశల్లో చే గురించి చేసిన ప్రసంగాలను కలిపి ఈ పుస్తకం రూపొందించింది.

నా స్మృతిలో చేగువేరా
ఫైడల్ కాస్ట్రో
వెల : 40/-, పేజీలు : 124
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, అన్ని బ్రాంచీలలో దొరుకును

స్వీకారం







చిఱుగాలి సాహిత్యం

వెల : 10/- పేజీలు16 ప్రచురణ : ఫ్రీలైన్స్ పబ్లికేషన్స్ ఫిల్మ్‌నగర్, జుబ్లిహిల్స్, హైదరాబాద్ - 500 033

బొప్పాయి పెరుగుపచ్చడి

కావాల్సిన వస్తువులు

పచ్చి బొప్పాయి కాయ	:	ఓ మోస్తరు సైజుది ఒకటి
పెరుగు	:	250 గ్రాములు
ఛాయపప్పు	:	25 గ్రాములు
శనగపప్పు	:	25 గ్రాములు
మెంతులు	:	తగినన్ని
పచ్చిమిర్చి, ఎండుమిర్చి	:	నాలుగేసి చొప్పన
ఉల్లిపాయలు	:	రెండు పాయలు
కరివేపాకు	:	రెండుమూడు రెబ్బలు

తయారుచేయు విధానం

తొక్కతీసిన బొప్పాయి సన్నగా కొబ్బరికోరులా తురుముకోవాలి. ఉల్లిపాయలు, కొత్తిమీర సన్నగా తరగాలి. బాండీలో నూనె వేసి కొద్దిగా పోపు పెట్టాలి. బొప్పాయి తురుమును వేసి రెండుమూడు నిముషాలు మగ్గనివ్వాలి. పెరుగులో పసుపు, కారం, ఉప్పు తగినంత వేసి కలిపుంచుకోవాలి. మగ్గిన బొప్పాయిలో పెరుగుపోయాలి. ఉల్లి, కొత్తిమీర, పచ్చిమిర్చి వేసి కలియబెట్టాలి. తయారైనాక మళ్లీ రెండవసారి పోపుపెట్టి దించుకోవాలి. కొద్దిగా కొబ్బరికోరు కూడా వేసుకుంటే ఇంకా రుచిగా ఉంటుంది.

అరటి ఊచ పులుసు

కావాల్సిన వస్తువులు

అరటి ఊచ	:	సుమారుగా 250 గ్రాముల ముక్క
చింతపండు	:	150 గ్రాములు
ఉల్లిపాయలు	:	250 గ్రాములు
మంచినూనె	:	100 గ్రాములు
కారం	:	రెండు టీ స్పూన్లు
పసుపు	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత
పచ్చి మిర్చి	:	4,5

తయారుచేయు విధానం

ఒక గిన్నెలో నీళ్లు తీసుకొని ఒక కప్పు మజ్జిగ పోసి ఉంచుకోవాలి. అరటి ఊచ పై పొరలు తీసేసి పొట్లకాయంత వెడల్పున ఉండే పల్ప్‌ను అడ్డొచ్చే పీచును వేరుచేస్తూ సన్నటి చక్రాలుగా తరగాలి. మజ్జిగ కలిపిన నీళ్లలో తరిగినవి తరిగినట్లే వేసేయాలి. లేకపోతే నల్లబడిపోతాయి. తరిగిన ముక్కల్ని కవ్వంతో చిలకాలి. ఆ మజ్జిగ నీళ్లలో ముక్కలు గట్టిగా పిండి వేరే గిన్నెలోకి తీసి కప్పు నీళ్లుపోసి ఉడకబెట్టాలి. ముందుగానే చింతపండుని నీళ్లలో నానబెట్టి పులిహోరలో పోసే పులుసులా పిండుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. బాండీలో గానీ కూరగిన్నెలో గానీ పోపు తాలింపు వేసి: (తినేవారు ఇంగువ కూడా వేసుకోవచ్చు), అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి దోరగా వేయించాలి. ఉడికించి అట్టేపెట్టుకున్న అరటి ఊచను వేయాలి. మూతవేసి వేయించాలి. కొద్దిసేపు మగ్గినాక దానిలో చింతపండు పులుసు వేసి పులుసు దగ్గరకొచ్చేవరకు ఉడికించుకోవాలి. ఈ పులుసు అప్పటికప్పుడు తినేకంటే...ముందురోజు రాత్రి పులుసు తయారుచేసి ఉంచుకుని మర్నాడు భోజనానికి సిద్ధం చేసుకుంటే చక్కగా పులుసుపట్టి ఓ ప్రత్యేకరుచి తోడౌతుంది.

పంపినవారు : శ్రీమతి టీ అనూరాధ, కూకట్‌పల్లి, హైదరాబాద్



చూటీ

అబ్బో ఇది చాలా కాలం నాటి సంగతి. అప్పుడు ఒక రాజు వున్నాడు. అతను చాలా బలవంతుడు. అతని దగ్గర బోలెడన్ని ఏనుగులు, గుర్రాలు వున్నాయి. ఇంకా పెద్ద సైన్యం వుంది. అంతేకాదు అతని దగ్గర చాలా బంగారం, ధనం వుంది. రాజ్యంలోని ప్రజలందరికీ అతనంటే చెప్పలేనంత భయం. అలాగని అతను సంతోషంగా వున్నాడా? అంటే అదీ లేదు. ఎప్పుడూ విచారంగా, అనారోగ్యంగా వుండేవాడు. డబ్బు, అధికారం అతనికి ఏ మాత్రం సంతోషాన్ని ఇవ్వలేకపోయాయి. దేశంలోని వైద్యులు కూడా అతనికి ఏవిధంగానూ నయం చేయలేకపోయారు. దాంతో వారిమీద రాజుగారికి విపరీతమైన కోపం వచ్చింది. వారి తలలను నరికించివేశాడు.

ఓ రోజు పక్క రాజ్యంనుంచి ఇద్దరు వైద్యులు వచ్చారు. వారిని భటులు సాదరంగా రాజుగారి భవనానికి తీసుకువచ్చారు.

రాజు వారిని గౌరవ మర్యాదలతో ఆహ్వానించాడు. విందు భోజనాలు ఏర్పాటు చేశాడు. తర్వాత వారితో మాట్లాడుతూ 'మీరు మోసుకెళ్లగలిగినంత బంగారం ఇస్తాను. కానీ నా అనారోగ్యాన్ని పోగొట్టాలి. నేను సంతోషంగా వుండేట్లు చేయాలి' అన్నాడు.

ఆయన మాటలకు వైద్యులు ఎంతగానో సంతోషించారు. ఎంతో అనుభవం వున్న డాక్టర్లం కనుక రాజుగారి జబ్బును నయం చేయడం చిటికెలో పని అనుకున్నారు. తర్వాత రాజుగారు ఇచ్చే బహుమతులు తీసుకెళ్లి మంచి మేడలు, మిద్దెలు కొనుక్కొని దర్జాగా బతకవచ్చని ఆశపడ్డారు.

మొదటి వైద్యుడు రాజుగారిని పరీక్షించాడు. రాజులో ఎటువంటి సమస్యా కనిపించలేదు. దాంతో ఆయన 'రాజా! మీరు ఎంతో ఆరోగ్యంగా వున్నారు. మీకు ఎటువంటి జబ్బూ లేదు. మీరు అనవసరంగా కంగారు పడుతున్నారు. అంతేకాదు. అనారోగ్యంతో వున్నానని భ్రమపడుతున్నారు. అంతకు మించి మీకు ఎటువంటి సమస్యా లేదు' అన్నాడు.

వెంటనే రాజుగారు ఇస్తానన్న బహుమానం ఇచ్చేసినట్టే, తాను నౌకర్లతో సేవలు పొందుతున్నట్టే ఊహించుకోసాగాడు. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది. ఆ మాటలు వినగానే రాజుగారికి చెప్పలేనంత కోపం వచ్చింది. భటులను పిలిచి ఆ వైద్యుని తల నరికేయమన్నారు.

ఇదంతా చూసిన రెండవ వైద్యుడు కాస్త తెలివిగా వ్యవహరించాలని అనుకున్నాడు. లేకపోతే తన తల కూడా తెగుతుందనుకున్నాడు.

మామూలుగానే రాజుగారిని పరీక్షించాడు. తర్వాత చిన్నగా నవ్వుతూ 'ఓ రాజా! మీరు ఈ దేశం మొత్తంలోకి సంతోషంగా వున్న వ్యక్తి చెప్పులు వేసుకోవాలి. అప్పుడు మీకు అంతా బాగవుతుంది' అన్నాడు. ఆ మాటలకు రాజు ఎంతగానో సంతోషించాడు. ఈ వైద్యుడు చాలా తెలివిగలవాడనుకున్నాడు. అంతేకాదు పెద్ద సంచి నిండా బంగారం ఇచ్చి పంపాడు.

ఇక రాజ్యం మొత్తంలోకి సంతోషంగా వుండే వ్యక్తి కోసం రాజు అన్వేషణ ప్రారంభించాడు. ఎన్ని రోజులు వెతికినా అలాంటి వ్యక్తి కనిపించలేదు. వందల, వేల మందిని అడిగాడు. కానీ ఏ ఒక్కరూ సంతోషంగా వున్నామని చెప్పలేకపోయారు. ఏదో ఒక సమస్య చెప్పకొచ్చారు. ఒక్కోసారి సంతోషంగాను, ఒక్కోసారి విచారంగానూ వుంటామని చెప్పారు. దాంతో రాజు డీలాపడిపోయాడు. 'ఇక అలాంటి వ్యక్తిని పసిగట్టటం సాధ్యం కాదేమో?!' అనుకుంటున్న చివరి క్షణాల్లో రాజుకి ఓ భిక్షగాడు కనిపించాడు. అతను మాత్రమే తాను ఎల్లప్పుడూ సంతోషంగా వుంటానని చెప్పాడు.

దాంతో రాజు కూడా సంతోషడిపోయాడు. వెంటనే 'అయితే నాకు నీ చెప్పులు ఇవ్వు. నిన్ను గొప్ప ధనవంతుడిని చేస్తాను' అన్నాడు.

రాజు మాటలకు భిక్షగాడు బిగ్గరగా నవ్వాడు. చాలా పెద్దగా నవ్వాడు. నవ్వీ నవ్వీ 'రాజా! నన్ను క్షమించండి. మీ కోరికను తీర్చలేకపోతున్నాను. నాకు చెప్పలే లేవు' అన్నాడు.

అప్పుడు రాజుకు జ్ఞానోదయమైంది. అసలు విషయం బోధపడింది. సంతోషం అనేది డబ్బులో, అధికారంలో లేదని తెలుసుకున్నాడు.